హైదరాబాద్ వార్త

వామ్మో లిఫ్ట్.!

-వరుస ఘటనలతో నగరవాసుల బెంబేలు

-నాణ్యత లేమి..నిర్వాహణ లోపంతో ప్రమాదాలు

-ఆఫీసులు, అపార్ట్‌మెంట్‌లల్లో లిఫ్ట్ ఎక్కాలంటే భయం

హైదరాబాద్,మే 9,ప్రభాతవార్త:
హైదరాబాద్ నగరంలో లిఫ్ట్ ప్రమాదాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. ఇటీవల జరిగిన వరుస సంఘటనలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి.పలు ఆఫీసుల్లో ,అపార్ట్ మెంట్‌లల్లో లిఫ్ట్ చూడగానే జనం భయపడుతున్నారు. అవసరమైతే నడుచుకుంటూ దిగుతాం కానీ లిఫ్ట్ ఎక్కమని చెబుతున్నారు. మొన్న నాంపల్లిలో చిన్నారి అర్ణవ్ లిఫ్ట్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఘటన..అలాగే మెహదీపట్నంలోని ఓ హాస్టల్ లిఫ్ట్‌లో ఇరుక్కుని ఏడాదిన్నర వయస్సు ఉన్న బాలుడు మృత్యువాత పడడం అందరికీ కలచివేసింది. ఇప్పుడు తాజాగా ఆర్సీ పురంలోని రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. లిఫ్ట్‌లో ఇరుక్కుని నాలుగేళ్ల బాలుడు గిరిధర్ మృతిచెందాడు. గుంటూరు జిల్లా సత్తెనపల్లికి చెందిన వేంకటేశ్వర్లు.. రామచంద్రారెడ్డి నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. భార్య, కుమారుడితో కలిసి అక్కడే నివసిస్తున్నాడు. అయితే, ఆడుకునేందుకు వెళ్లిన వేంకటేశ్వర్లు కుమారుడు గిరిధర్ లిఫ్ట్ ఎక్కాడు. ప్రమాదవశాత్తూ అందులో ఇరుక్కుపోయాడు. లిఫ్ట్ నుంచి భారీ శబ్దం రావడంతో కుటుంబ సభ్యులు, అపార్ట్‌మెంట్ వాసులు అప్రమత్తమయ్యారు. వెంటనే లిఫ్ట్ వద్దకు పరుగులు తీశారు. అతి కష్టంపై చిన్నారిని బయటకు తీశారు. బాలుడు స్పృహలో లేకపోవడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. పరీక్షి ంచిన వైద్యులు అప్పటికే గిరిధర్ మృతిచెందినట్టు వెల్లడించారు. దీంతో బాధిత కుటుంబం కన్నీటిపర్యంతమైంది. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు మృతిచెందడంతో తల్లి దండ్రులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎందుకిలా..

ఈ వరుస లిఫ్ట్ ప్రమాదాలు నగర ప్రజలను భయపెట్టేలా మారాయి. సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, పాత లిఫ్ట్‌ల మరమ్మతు చేయకపోవడం, నిర్లక్ష్యంగా నిర్వహించడం వంటి కారణాలతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి.అపార్ట్‌మెంట్లు, హాస్టళ్లలోని లిఫ్ట్‌లు సాంకేతికంగా మెరుగుపరచాలి. రెగ్యులర్‌గా లిఫ్ట్‌లను పరీక్షించి మరమ్మతులు చేయాలి. పిల్లలు లిఫ్ట్‌లో ప్రయాణిస్తున్నప్పుడు పెద్దలు పర్యవేక్షణ చేయాలి. ఎమర్జెన్సీ అలర్ట్ సిస్టమ్, ఆటోమేటిక్ సెన్సార్లు అమర్చేలా చర్యలు తీసుకోవాలి. ఈ ప్రమాదాలు మరింత మందిని బలిచేయకముందే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లిఫ్ట్‌ల భద్రతను పటిష్ఠంగా అమలు చేయకుంటే, ఇలాంటి విషాద ఘటనలు మరింత పెరిగే అవకాశం ఉంది. తెలంగాణ ఎలివేటర్స్ అండ్ ఎస్కలేటర్స్ అసోసియేషన్ (టీఈఈఏ) లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఏటా దాదాపు 10 వేల ఎలివేటర్లను విక్రయిస్తున్నారు. వీటిల్లో 20 శాతమే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ప్రమాణాల ప్రకారం ఉంటున్నట్లు అంచనా. మిగిలిన 80 శాతం నైపుణ్యం లేని తయారీదారులు విక్రయిస్తున్నవే కావడం గమనార్హం. తయారీ సంస్థల దగ్గర అయిదారు నెలలు పనిచేసిన కార్మికులే సొంతంగా ఎలివేటర్లను తయారు చేస్తున్నారు. బిల్డర్ల వద్ద తక్కువ ధరలకు కాంట్రాక్టులు తీసుకుని ఎలివేటర్లను సరఫరా చేసి బిగిస్తున్నారు. మరోవైపు అపార్ట్‌మెంట్ సంఘాలు నెలవారీ నిర్వహణను పట్టించుకోకపోవడం వంటి కారణాలతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నట్లు తెలుస్తోంది.లిఫ్ట్ ఏర్పాటు చేశాక ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటు నిరభ్యంతర పత్రం జారీ చేయాల్సి ఉన్నా చట్టం లేకపోవడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. అపార్ట్‌మెంట్ సంఘాలు నెలవారీ రూ.2 వేల వరకు నిర్వహణ వ్యయాన్ని విస్మరిస్తుండటం ప్రమాదాలకు కారణమవుతుంది. క్షేత్రస్థాయిలో విద్యుత్ సిబ్బంది కొందరు లంచాలకు అలవాటు పడి లిఫ్ట్‌లకు ఎంత లోడు కరెంటు కనెక్షన్ ఇస్తున్నారనేది కూడా తనిఖీ చేయడం లేదనే ఆరోపణలు చాలా ఎక్కువగా ఉన్నాయి.

ప్రధాని పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత

-పరేడ్ గ్రౌండ్స్ సభకు 2వేల మందితో పోలీస్ బందోబస్తు

-పోలీసులకు ప్రజలు సహకరించాలి : సిపి సుమతి

బేగంపేట మే 9,ప్రభాతవార్త
సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరగనున్న ప్రధాని మోదీ సభకు లక్షమందికి పైగా హాజరు అవుతారని అంచనావేస్తున్నామని,ఈ సందర్భంగా 2వేల మంది పోలీసులతో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు మల్కాజ్‌గిరి సీపీ బడుగుల సుమతి తెలియజేసారు.పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సీపీ సుమతి మాట్లాడుతూ 620మంది ట్రాఫిక్ పోలీసు సిబ్బందితో పాటు ప్రత్యేక యూనిట్లను మోహరించి విస్తృతమైన భద్రత ను ఏర్పాటు చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమాన్ని ముగ్గురు డీసీపీలు 05 మంది అదనపు డీసీపీలు పర్యవేక్షిస్తారన్నారు. 21మంది డీసీపీలు,21మంది ఏసీపీలు 61మంది పీడీఎస్పీలు,57మంది ఇన్స్‌పెక్టర్లు,226మంది సబ్‌ఇన్స్‌పెక్టర్లతో పాటు 1045మంది ఏఎస్సైలు,హెచ్‌సీలు,పీసీలు,హోంగార్డులు 12బెటాలియన్ ప్లాటూన్లు,6ఏఆర్ ప్లాటూన్లు,అక్టోపస్ బృందాలు,ఎస్‌ఓటీ బృందాలు,ఐటీసెల్ కమాండ్ కంట్రోలు బృందాలు,షీ బృందాలు,సీఎస్‌డబ్ల్యూ,బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌లు,స్నిఫర్ డాగ్ స్క్వాడ్‌లు 620మంది ట్రాఫిక్ సిబ్బందిని మోహరించామన్నారు. డ్రోన్‌లు,యూఏవీలు, కెమెరాలు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు బ్యాగులు,బ్యానర్లు,నీటి సీసాలు, మండే పదార్థాలు,పదునైన వస్తువులు,బయటి ఆహార పదార్థాలు తీసుకు రావడం నిషేధించామన్నారు.మధ్యాహ్నం గం 1నుంచి రాత్రి గం 9వరకు భారీ వాహనాలపై ఆంక్షలు ఉంటాయన్నారు.సభకోసం 12పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసామన్నారు.పార్కింగ్ ప్రదేశాల వద్ద క్యూఆర్ కోడ్ ఉంటుందన్నారు.రోడ్లపై వాహనాలు పార్కు చేస్తే సీజ్ చేస్తామన్నారు.జిల్లాల నుంచి 3200బస్సులు వస్తాయని అంచనా వేస్తున్నామన్నారు. ఉప్పల్ నిజాం కాలేజ్,సంజీవయ్య పార్కు దగ్గర బస్సులు పార్కు చేసి మెట్రోలో సభకు చేరుకోవాలన్నారు.వైద్య సహాయం కోసం అగ్నిమాపక భద్రత ,అత్యవసర తరలింపు కోసం తగిన ఏర్పాట్లు చేసామన్నారు.పార్టీ ప్రతినిధులు, మీడియా సిబ్బంది గుర్తింపు పొందిన సభ్యులు వారికి కేటాయించిన ప్రదేశాలల్లో మాత్రమే ఉండాలని, భద్రతా నియమాలను ఖచ్చితంగా పాటించాలని సీపీ కోరారు.నల్గొండ ఖమ్మం సూర్యాపేట వరంగల్ ల నుంచి వచ్చే బస్సులు ఉప్పల్ వద్ద ప్రయాణికులను దించాలన్నారు.ఐఏఎల్ఏ పార్కింగ్,ఆర్‌జీఐ స్టేడియం(900),ఉప్పల్ భగాయత్(100),రైల్వేడిగ్రీకాలేజి(100).ఆర్ఆర్‌సీగ్రౌండ్స్ లో (100)వాహనాలను పార్కింగ్ చేసుకో వచ్చన్నారు.నిజామాబాద్ ,మెదక్,కరీంన గర్ ఆదిలాబాద్ నుంచి వచ్చే వాహనాలు బోయిన్‌పల్లి తిరుమలగిరి మీదుగా వచ్చే బస్సులు దోభీఘాట్ వద్ద ఆగాలన్నారు.పార్కింగ్ బైసన్ పోలో గ్రౌండ్ (800),దోభీఘాట్ (200),ఇంపీరియల్ గార్డెన్ (50),బోయిన్ పల్లి మార్కెట్ యార్డు(50), మెహదీపట్నం ,మహబూబ్‌నగర్ కర్నాటక మార్గం నుంచి వచ్చే వారు రేతిబౌలి,మెహదీపట్నం, మాసబ్ ట్యాంకు మీదుగా వచ్చే బస్సులు నెక్లెస్ రోడ్డు (సంజీవయ్య పార్కు) వద్ద ఆగాలి. సంగారెడ్డి,హైటెక్ సిటీ మార్గం జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ పంజాగుట్ట మీదుగా వచ్చే బస్సులు నల్లగుట్ట వద్ద ఆగాలి.పార్కింగ్ నెక్లెస్ రోడ్డు (800) పై పార్కింగ్‌లు నిండిపోతే నగరానికి వచ్చే బస్సులను నగర శివార్లలోనే నిలిపి వేయనున్నట్లు పోలీసులు తెలియజేసారు.

స్వీయ గణనతోనే నగర ప్రగతి

-ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

హైదరాబాద్ మే 9 (ప్రభాతవార్త) : ప్రతి నగర పౌరుడు స్వచ్ఛందంగా స్వీయ గణన ప్రక్రియలో పాల్గొని నగరాభివృద్ధికి సహకరించాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కార్పొరేషన్ పరిధిలో స్వీయ గణన, స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత కార్యక్రమాలు నిర్వహించారు. ఎల్బీ నగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో ఆధ్వర్యంలో వీఎం హోమ్స్ నుంచి కొత్తపేట జంక్షన్ వరకు నిర్వహించిన 2కే రన్ సందడి జరిగింది. అలాగే నాచారం, కాప్రా సర్కిళ్లలో కాప్రా కార్యాలయం నుంచి రాధికా థియేటర్ వరకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అధికారులు చైతన్యపురి, రాఘవేంద్ర కాలనీల్లో పర్యటించి నాలా డీసిల్టింగ్ పనులను పర్యవేక్షించారు. పారిశుద్ధం, పారదర్శక పాలనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు.క్రాంతినగర్, జనప్రియ, శృంగేరి కాలనీల నివాస సంఘాలు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో కమిషనర్ సమావేశమయ్యారు. స్వీయ గణన పూర్తి చేయడం, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. నాగారం, ఘట్‌కేసర్ డివిజన్లలో డిప్యూటీ కమిషనర్ వాణి ఆర్‌డబ్ల్యూఏలతో ప్రత్యేక భేటీలు నిర్వహించి అవగాహన కల్పించారు.99 రోజుల కార్యాచరణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఖిమెగా ఈవేస్ట్ కలెక్షన్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. నగరం అంతటా 38 కలెక్షన్ పాయింట్ల ద్వారా సుమారు 3.53 మెట్రిక్ టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించారు. మొత్తం 71 రకాల ఎలక్ట్రానిక్ పరికరాలను ప్రజలు స్వచ్ఛందంగా అందజేశారు. ముఖ్యంగా మోలాలి సర్కిల్‌లో అత్యధికంగా ఒక మెట్రిక్ టన్ను ఈవేస్ట్ సేకరించినట్లు అధికారులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపడతామని కమిషనర్ పేర్కొన్నారు.

హిమాయత్‌నగర్ ఎమ్మార్వో ఆఫీసులో సెక్యూరిటీ సున్నా!

-కార్యాలయమా.. క్రీడా మైదానమా?

-విలువైన రికార్డులకు పొంచి ఉన్న ముప్పు

బాగ్ లింగంపల్లి లోని హిమాయత్ నగర్ తహసీల్దార్ కార్యాలయం రాత్రి వేళలో కూడా బార్ల గెట్లు తీసి ఉన్న దృశ్యం

చిక్కడపల్లి మే 9 (ప్రభాతవార్త) : ప్రభుత్వ కార్యాలయాలకు పనివేళలు ఉంటాయి.. కానీ హిమాయత్ నగర్ ఎమ్మార్వో కార్యాలయానికి మాత్రం అవేమీ వర్తించనట్టు కనిపిస్తోంది. కార్యాలయ సమయం ముగిసినా, సిబ్బంది ఇళ్లకు వెళ్ళిపోయినా.. ప్రధాన ద్వారాలు మాత్రం ఖిబార్లాఖి తెరిచే ఉంటున్నాయి. లోపల ఉన్న కోట్లాది రూపాయల విలువైన ఆస్తులకు, అత్యంత కీలకమైన భూ రికార్డులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను అధికారులు గాలికి వదిలేశారు. వేల సంఖ్యలో విలువైన భూ రికార్డులు, ప్రజల వ్యక్తిగత సమాచారానికి నిలయం. కానీ నేడు ఆ కార్యాలయానికి రక్షణ కరువైంది. ఒకప్పుడు పచ్చదనంతో, వాచ్‌మెన్ పహారాతో కళకళలాడిన హిమాయత్ నగర్ తహసీల్దార్ (ఎమ్మార్వో) కార్యాలయం ఇప్పుడు అస్తవ్యస్తంగా మారింది. అధికారుల నిర్లక్ష్యం పుణ్యమా అని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఎండలు మండిపోతుండటంతో, స్థానిక యువతకు ఆడుకోవడానికి సరైన మైదానాలు లేక ఎమ్మార్వో కార్యాలయాన్నే వేదికగా చేసుకుంటున్నారు. సెలవు దినాల్లో ఈ కార్యాలయ ఆవరణ ఒక క్రీడామైదానాన్ని తలపిస్తోంది. యువకులు ఇక్కడ క్రికెట్ వంటి ఆటలు ఆడుతుండటంతో కార్యాలయ కిటికీలు, ఇతర సామగ్రి దెబ్బతినే ప్రమాదం ఉంది. సాధారణంగా ఉద్యోగులు తమ ఇంటికన్నా ఎక్కువ సమయం కార్యాలయంలోనే గడుపుతుంటారు. అటువంటి చోట ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చదనం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. గతంలో ఉన్న పచ్చదనం ఇప్పుడు కనుమరుగైంది. కార్యాలయాన్ని తమ సొంత ఇంటిలా భావించి సంరక్షించాల్సిన అధికారులు, కనీసం భద్రతను కూడా పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని, హిమాయత్ నగర్ ఎమ్మార్వో కార్యాలయానికి పటిష్టమైన భద్రత కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. వెంటనే వాచ్‌మెన్‌ను నియమించి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు, కార్యాలయ ఆవరణ క్రీడామైదానంగా మారకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పని వేళలు ముగిసిన తర్వాత అనవసర వ్యక్తులను లోపలికి అనుమతించకూడదని, ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటి, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఇకనైనా నిద్ర మత్తు వదిలి హిమాయత్ నగర్ ఎమ్మార్వో కార్యాలయాన్ని రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలి : సిపిఐ

హిమాయత్ నగర్ తహసీల్దార్ కార్యాలయం విషయంలో ఉన్నతాధికారులు భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ నగర నాయకుడు బాదమోని వెంకటస్వామి గౌడ్ డిమాండ్ చేసారు. ప్రస్తుతం ఈ కార్యాలయం ఎటువంటి భద్రతాపరమైన చర్యలు తీసుకోకపోవడం వల్ల పలు అనుమానాలకు తావిస్తోందని, వెంటనే చర్యలకు ఉపక్రమించాలి సూచించారు.

నగరంలో మాయమైన నీడ.. అద్భుతంగా జీరో షాడో డే

హైదరాబాద్, మే 9 ప్రభాతవార్త

నగరవాసులు శనివారం ఒక అపురూపమైన ఖగోళ దృశ్యాన్ని వీక్షించారు. ఈ అద్భుతాన్ని చూసేందుకు బిర్లా ప్లానిటోరియం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సంవత్సరంలో రెండు సార్లు సూర్యుడు సరిగ్గా మన నెత్తి మీదికి వస్తాడు. ఆ సమయంలో సూర్యకిరణాలు నిలువుగా పడటం వల్ల, భూమిపై నిటారుగా ఉన్న ఏ వస్తువు నీడ కూడా పక్కకు పడకుండా, సరిగ్గా ఆ వస్తువు కిందనే ఉండిపోతుంది. దీనివల్ల వస్తువుల నీడలు మాయమైనట్లు కనిపిస్తాయి.సరిగ్గా అలాంటిదే ఇప్పుడు మనం ఎక్స్పీరియన్స్ చేశాము.సరిగ్గా మధ్యాహ్నం 12:12 గంటలకు మన నీడ మయం అయింది.ఈ సన్నివేశం కేవలం ఒకటి నుంచి రెండు నిమిషాల పాటు మాత్రమే కనిపిస్తుంది.భూమి తన అక్షం మీద 23.5 డిగ్రీల వంపుతో తిరగడం వల్ల, సూర్యుడు ఉత్తరాయణం మరియు దక్షిణాయనం మధ్య కదులుతున్నట్లు కనిపిస్తాడు. ఈ క్రమంలో ఉత్తర అక్షాంశం 23.5 మరియు దక్షిణ అక్షాంశం మధ్య ఉన్న ప్రాంతాల్లో మాత్రమే ఈ జీరో షాడో డే సంభవిస్తుంది. హైదరాబాద్ భౌగోళికంగా ఈ పరిధిలోనే ఉండటం వల్ల మనకు ఈ అవకాశం కలిగింది. శనివారం ఈ వింతను మిస్ అయిన వారు మళ్లీ ఆగస్టులో చూడవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

మూసీలో పడిపోయిన మహిళను కాపాడిన హైడ్రా

-సమాచారం అందిన 16 నిమిషాల్లో రంగంలోకి సిబ్బంది

మహిళను బయటకు తీస్తున్న సిబ్బంది

హైదరాబాద్, మే 9,ప్రభాతవార్త: అంబర్‌పేట్ గోల్నాక సమీపంలో మూసీలో పడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళను హైడ్రా కాపాడింది. ఉదయం 10.51 గంటలకు హైడ్రా కంట్రోల్ రూమ్ కు ఫోన్ రాగా.. 11.07 గంటలకు హైడ్రా బృందాలు అక్కడకు చేరుకున్నాయి. అంబర్‌పేట్ సమీపంలోని గోల్నాక, భాగ్యనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఇందిర (49) శుక్రవారం రాత్రి మూసీలో పడిపోయింది. ఆ సమీపంలో ఒడ్డుకు చేరే అవకాశం లేని చోట.. చెట్లు అడ్డం ఉన్న చోట మూసీలోకి ఆమె జారి పడిపోయింది. రాత్రంతా ఆమె మూసీలోనే భయం భయంగా గడిపింది. కేకలు వేసినా ఎవరికీ వినపడలేదు. శనివారం ఉదయం 10 గంటల తర్వాత స్థానికులు గుర్తించారు. బయటకు తీయడానికి అవకాశం లేకపోవడంతో హైడ్రా కంట్రోల్ రూమ్ నంబర్ 90001 13667 కు ఫోన్ చేసి స్థానికులు సమాచారం ఇచ్చారు. స్వామి (డిఆర్‌ఎఫ్ రెస్క్యూ ఇంచార్జి) టీమ్ 16 అంబర్‌పేట్‌తో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. హైడ్రా సహాయక చర్యలు జరుగుతుండగానే ఫైర్ సిబ్బంది కూడా అక్కడకు చేరుకున్నారు. పెద్ద నిచ్చెన సహాయంతో డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు కిందకు దిగి మూసీలో ప్రాణభయంతో కొట్టుమిట్టాడుతున్న మహిళను కాపాడారు. అనంతరం ఆమెను కుటుంబ సభ్యులు, స్థానిక పోలీసులకు అప్పగించారు. పొరపాటున జారి పడిపోయినట్టు ఆమె చెప్పారు. భర్త లేడని యిద్దరి పిల్లలతో అక్కడే ఉంటున్నా అని ఆమె చెప్పారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళను హైడ్రా సిబ్బంది రక్షి ంచిన తీరును స్థానికులు అభినందించారు.

స్వీయగణకు నేడే చివరి రోజు

-ప్రతిఒక్కరూ ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి

-జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల

హైదరాబాద్, మే 9,ప్రభాతవార్త: స్వీయ జనగణనలో ఒక్క రోజే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఒక ప్రకటనలో తెలిపారు. 2027 జనగణనలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా స్వీయ గణన చేసుకునేందుకు ఈ నెల10 (ఆదివారం) వరకు మాత్రమే అవకాశం ఉన్నదని తెలిపారు. ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకునే ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. సెన్సెస్ వెబ్‌సైట్ ద్వారా ఇంటి వద్ద నుండే సులభంగా స్వీయ గణన నమోదు చేసుకోవాలని అన్నారు. మొబైల్ ఫోన్ ద్వారానే ఈ ప్రక్రియ పూర్తి సులభంగా నమోదు చేయవచ్చని, నచ్చిన భాషను ఎన్నుకొని వివరాలు నమోదు చేయాలని తెలిపారు. గత నెల 26వ తేదీ నుండి ప్రారంభమైన స్వీయ గణన ఆన్లైన్ నమోదు కార్యక్రమం ఈ నెల 10వ తేదీతో ముగుస్తుందని స్పష్టంచేశారు. జనగణన ప్రక్రియలో భాగంగా స్వీయ గణన, అనంతరం గృహాల లెక్కింపు, తదుపరి పూర్తి జనగణన నిర్వహిస్తారని వివరించారు. ఈ నెల 11వ తేదీ నుండి ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి హౌస్ లిస్టింగ్ చేపడతారని తెలిపారు. దేశ ప్రణాళిక, భవిష్యత్ అభివృద్ధి, వనరుల పంపిణీకి జనగణన కీలకమని కలెక్టర్ తెలిపారు. అద్దె ఇళ్లలో నివసిస్తున్నవారు కూడా తమ ప్రస్తుత నివాసం నుండే వివరాలు నమోదు చేసుకోవచ్చని సూచించారు. జనగణన సందర్భంగా అందరూ తమ కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలను ఖచ్చితంగా అందించాలని కోరారు. ఈ వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని, జనాభా లెక్కలకు మాత్రమే ఉపయోగించబడతా యని స్పష్టం చేశారు.

ఆసక్తికరం ప్రజాకళలో నవలాకారుల అనుభవసారం


నవలాకారుల కార్యక్రమంలో మాట్లాడుతున్న రచయితలు

రవీంద్రభారతి, మే 9 ప్రభాతవార్త :
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి పర్యవేక్షణలో తెలంగాణ ప్రజాకళ శీర్షికన జరుగుతున్న 99 రోజుల ప్రతిష్టాత్మక సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనల్లో భాగంగా రవీంద్రభారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల) కళావేదికలో వివిధ తెలంగాణ కళా సాంస్కృతిక మహోత్సవాలలో భాగంగా 4 నుండి 11వ తేదీవరకు కొనసాగే సాహిత్యవారం ఈరోజు జరిగిన నవలాకారుల అనుభవసారం కార్యక్రమం ఎంతో ఆసక్తికరంగా సాగింది. ప్రముఖ సాహితీవేత్త కె.పి.అశోక్‌కుమార్ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ నవలా రచయితలు అంపశయ్య నవీన్, ఎం.ఎస్.ప్రాణ్‌రావు, పి.చంద్, పెద్దింటి అశోక్‌కుమార్, శిరంశెట్టి కాంతారావు, ప్రభాకర్‌జైనీ మొదలైన రచయితలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి నవలా రచయితలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముందు తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఆట పాటలతో అలరించారు.

బైక్‌లపై స్టంట్స్ చేస్తే తాటతీస్తాం

-నిత్యం స్టంట్స్ చేస్తున్న యువకుల అరెస్టు..రెండు బైక్‌లు స్వాధీనం

అత్తాపూర్ మే9 ,ప్రభాతవార్త : నిత్యం యువకులు అత్తాపూర్ నుండి ఆరాంఘర్ మార్గంలో బైక్‌లపై స్టంట్స్ చేస్తూ హంగామా సృష్టిస్తున్నారు.పోలీసులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ మార్పు రావడం లేదు.తాజా రహదారులపై ప్రాణాపాయం కలిగించే విధంగా బైక్ స్టంట్లు చేస్తూ, మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న ఆరుగురు నిందితులను రాజేంద్రనగర్ జోన్ టాస్క్ ఫోర్స్ మరియు అత్తాపూర్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు.గత కొంతకాలంగా అత్తాపూర్ నుండి ఆరాంఘర్ మధ్య ప్రధాన రహదారులపై కొందరు యువకులు ద్విచక్ర వాహనాలతో ప్రమాదకర విన్యాసాలు చేస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. వీరు కేవలం తమ ప్రాణాలనే కాకుండా, పాదచారుల మరియు ఇతర వాహనదారుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేస్తున్నారు. ట్రిపుల్ రైడింగ్, జిగ్‌జాగ్ డ్రైవింగ్, వీలీలు వంటి స్టంట్లు చేస్తూ వాహనాల నుండి నిప్పురవ్వలు వచ్చేలా రాపిడి చేస్తూ వీరంగం సృష్టిస్తున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో సిఐ నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించిన పోలీసులు హసన్ నగర్‌కు చెందిన సయ్యద్ షాహెద్ (19) షేక్ నసీర్ హుస్సేన్ (19)షేక్ జునైద్ (18) కాలాపత్తర్‌కు చెందిన మొహమ్మద్ బిన్ ఇసా (17) అబ్దుల్ సమద్ (20)ఎన్.టి.ఆర్ నగర్ చెందిన మొహమ్మద్ అర్బాజ్ హుస్సేన్ ఖాన్ (22)లను అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు.బైక్‌లపై విన్యాసాలు చేస్తూ ఇబ్బందులు కల్గిస్తే తాటా తీస్తామని పోలీసులు హెచ్చరించారు.వీరి నుండి 6 మొబైల్ ఫోన్లు ,మైస్ట్రో డీలక్స్ స్కూటీ (టిఎస్ 12 ఈసి 0002) డియో స్కూటీ (టిఎస్ 12 ఈఎల్ 0755)లను స్వాధీనం చేసుకున్నారు.వీటి విలు మొత్తం విలువ సుమారు రూ. 1,50,000 ఉంటుందని వెల్లడించారు.హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఈ ఆపరేషన్ నిర్వహించిన డిసిపి వైభవ్ గైక్వాడ్ (టాస్క్ ఫోర్స్), రాజేంద్రనగర్ టాస్క్ ఫోర్స్ మరియు అత్తాపూర్ పోలీసు బృందాలను అభినందించారు.తల్లిదండ్రులు తమ పిల్లల కార్యకలాపాలను నిశితంగా గమనిస్తూ ఉండాలన్నారు.రహదారులపై ఎక్కడైనా ప్రమాదకర డ్రైవింగ్ లేదా బైక్ స్టంట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మీర్‌పేట్ పోలీసులపై దాడి.. బడంగ్‌పేట్‌లో అర్ధరాత్రి వివాదం

-ముగ్గురు అరెస్ట్

సరూర్‌నగర్, మే 9 ప్రభాతవార్త: అర్ధరాత్రి విధులు నిర్వహిస్తున్న ఒక హోంగార్డు, ఓ ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్ (ఎఆర్‌పిసి) లపై దాడి జరిగింది. ఈ సంఘటన హైదరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని మీర్‌పేట్ పిఎస్ ఏరియాలో జరిగింది. హోంగార్డు ధరావత్ లింగనాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్న లింగనాయక్ (హెచ్‌జి 1884), ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న అఖిల్‌వాసు (ఎఆర్‌పిసి 13221)లు ఎస్‌హెచ్‌ఓ ఆదేశాల మేరకు గురువారం రాత్రి కౌంటర్ యాక్షన్ టీం (సిఏటి) డ్యూటీలో ఉన్నారు. అయితే అర్ధరాత్రి 12.41 గంటల సమయంలో బడంగ్‌పేట్ గ్రంథాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో బైక్‌పై ఇద్దరు యువకులు కూర్చొని ఉండడాన్ని గమనించిన వారు అక్కడికి వెళ్ళి ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో సదరు యువకుల వివరాలు అడుగుతుండగానే గొడవ చెలరేగింది. దీంతో ఆ యువకులు ఫోన్లు చేసి మరికొంత మందికి అక్కడికి రప్పించారు. వారంతా పోలీసులను ఎదురు ప్రశ్నిస్తూ అసలు మీరు పోలీసు లేనా.. గ్యారంటీ ఏందని అసభ్య పదజాలంతో దూషించి దాడి చేశారు. ఈ మేరకు హోంగార్డు తాగి ఉన్న యువకులు తమ విధులకు ఆటంకం కలిగించి దాడి చేశారంటూ మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సాయి కుమార్, నర్సింహ, ప్రభు, శివకుమార్, కృష్ణ, మహేష్‌లతో పాటు మరికొంత మంది తమ విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల్లో సాయికుమార్, నర్సిహ, ప్రభులను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు తెలిసింది. మిగతా వారు పరారీలో ఉన్నట్లు సమాచారం. కేసు దర్యాప్తులో ఉంది.

11న బిసిటిఎ ప్రతిభా పురస్కారాల ప్రదానం

చాంద్రాయణగుట్ట, మే 9, ప్రభాతవార్త : బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ (బిసిటిఎ) ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ సోమవారం మహాత్మా జ్యోతిబాపూలే ప్రతిభా పురస్కారాలు -2026 ప్రదానం చేయనున్నట్లు ఆ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బియ్యం సంతోష్ కుమార్, లక్ష్మీకాంతరావులు ఒక ప్రకటనలో తెలిపారు. రవీంద్రభారతిలో ఉదయం 10 గంటలకు ప్రారంభమైయ్యే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, నాగర్కర్నూల్ ఎంపి మల్లు రవి, రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తదితర ప్రముఖులు హాజరైతారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పదవ తరగతిలో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు గౌరవ పురస్కారం, ఉత్తమ విద్యా ప్రమాణాలు పాటించి ప్రధానోపాధ్యాయులను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రధాని మోడీ పర్యటనను బిసిలు బహిష్కరించాలి

ప్రభుత్వ సలహాదారు హనుమంతరావుకు సంఘీభావం తెలుపుతున్న వెంకటేష్

చాంద్రాయణగుట్ట, మే 9, ప్రభాతవార్త : ప్రధాన మంత్రి నరేంద్ర మోడి తెలంగాణ పర్యటనను బీసీలు కలిసికట్టుగా బహిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం మాజీ ఇంచార్జి కె.వెంకటేష్ కోరారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా మొదలు పెడుతున్న జనగణలో బీసీల కులగణన చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంతరావు శనివారం అంబర్‌పేట్‌లోని తన నివాసం వద్ద చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షకు పాతబస్తీ నేతలు మద్దతు పలికారు. సీనియర్ నేత వెంకటేష్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు తరలివెళ్లి హనుమంతరావుకు పార్టీ కండువా కప్పి పూలమాలతో సన్మానించారు. తమ సంఘీభావాన్ని తెలియజేశారు. ఈ సందర్బంగా వెంకటేష్ మాట్లాడుతూ దేశంలో సమగ్ర కులగణన చేస్తామన్న మోదీ మాటలు ఏమైయ్యాయని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఎందుకు ఆమోదించడం లేదని ప్రశ్నించారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని కులాలు ఆధిపత్యం చేస్తూ బీసీలను అణచివేస్తున్నారని ఆరోపించారు. ప్రధాని బిసిలను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మూడు రాష్ట్రాల ఫలితాలు పునరావృతం అవుతాయి

-బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఛాతిరి పార్థసారథి

బాగ్ లింగంపల్లి మోడీ సభ విజయవంతం కోసం ప్రచారాన్ని నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఛాతిరి పార్థసారథి

చిక్కడపల్లి మే 9 (ప్రభాతవార్త) :
పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి ఎన్నికల్లో బీజేపీ సాధించిన విజయోత్సాహం తెలంగాణలోనూ కొనసాగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఛాతిరి పార్థసారథి ధీమా వ్యక్తం చేశారు. శనివారం బాగ్ లింగంపల్లి లో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న మోదీ భారీ బహిరంగ సభకు సంబంధించిన వాల్ రైటింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాగ్ లింగంపల్లి డివిజన్ లోని చిక్కడపల్లి, బాగ్ లింగంపల్లి, అచ్చయ్యనగర్, పద్మా కాలనీ, సంజయ్ నగర్ తదితర ప్రాంతాలలో ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు.మోడీ సభకు విద్యార్థులు, నిరుద్యోగులు, వ్యాపారులు, భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు జక్కా శ్రీను, జైపాల్ రెడ్డి, బీరయ్య, నరసింహ, రాజు, హర్ష తదితరులు పాల్గొన్నారు.

మానవత్వానికి నిలువుటద్దం దుడ్డు సుబ్రహ్మణ్యం దంపతులు

దుడ్డు సుబ్రహ్మణ్యం దంపతులను సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి మే 9 ప్రభాతవార్త : నిస్వార్థ సేవే లక్ష్యంగా, ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్న సేవామూర్తి దుడ్డు సుబ్రహ్మణ్యం దంపతులు అని వక్తలు ప్రశంసించారు. శనివారం ద్యుతి మ్యూజికల్ అకాడమీ, ఇషాన్ ఫౌండేషన్ , విజయ్ క్రియేషన్స్ అధినేతలు పేరి నాగేశ్వర్ రావు, పేరి విజయలక్ష్మి సంయుక్త ఆధ్వర్యంలో అభినందన సత్కార కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పేరి నాగేశ్వరరావు, పేరి విజయ లక్ష్మి , సిండికేట్ బ్యాంక్ మాజీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పేరి కామేశ్వర రావు మాట్లాడుతూ సేవ అంటే కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, అవసరమైన సమయంలో తోడుగా నిలబడటమే నిజమైన మానవత్వమని పేర్కొన్నారు. సమాజంలో ధనవంతులు ఎందరో ఉన్నా, పరుల కష్టాన్ని తన కష్టంగా భావించే వారు అరుదుగా ఉంటారని, ముఖ్యంగా ఎవరైనా మరణించినప్పుడు ఆ కుటుంబానికి మానసిక ధైర్యాన్ని ఇస్తూ, అంత్యక్రియల ఏర్పాట్లలో స్వచ్ఛందంగా పాల్గొని సుబ్రహ్మణ్యం అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ప్రశంసించారు. ఆయన సేవలో భాగస్వామిగా నిలుస్తున్న ఆయన సతీమణి ని కూడా ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు సామాజిక కార్యకర్తలు, కళాకారులు పాల్గొని తమ అభినందనలు తెలియజేశారు.

ప్రజలందరూ స్వచ్ఛందంగా స్వీయగణన చేసుకోవాలి

- జడ్‌సి హేమంత్ సహదేవరావు

నార్సింగి సర్కిల్ కోకాపేట్ వద్ద స్వీయ గణన వాకథన్‌ను ప్రారంభిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ సహదేవరావ్.

నార్సింగి, మే 9 ప్రభాతవార్త : ప్రజలందరూ స్వచ్ఛందంగా స్వీయ గణనను చేసుకోవాలని శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ బి.హేమంత్ సహదేవరావు పేర్కొన్నారు. శనివారం నార్సింగి సర్కిల్ పరిధిలోని కోకాపేట్ వద్ద స్వీయ గణనపై ఏర్పాటు చేసిన మారథన్‌ను జడ్‌సి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీయ గణనపై ప్రజలలో ఉన్న అపోహలు తొలగించి, అవగాహన కల్పించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు మీ కుటుంబ సభ్యుల వివరాలను మీ మొబైల్స్/కంప్యూటర్ల ద్వారా పోర్టల్‌లో రాష్ట్రంను ఎంచుకొని 33.ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని సూచించారు. మీ వివరాలను మీరే పూర్తి చేసుకుంటే సమయం ఆదా అవుతుందని, లేదంటే అధికారులు మీ ఇళ్లకు వచ్చి పూర్తి వివరాలు తీసుకుంటారని తెలిపారు. స్వీయ గణన ఈ నెల 10.వ,తేదీతో ముగుస్తుందని గుర్తు చేశారు. మీ వివరాలు పూర్తి గోప్యంగా ఉంచబడుతాయని జడ్‌సి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నార్సింగి డిసి కృష్ణ మోహన్‌రెడ్డి, పలువురు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థిగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోనే విలువలు నేర్చుకున్నా

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తిరుమల దేవి

అత్తాపూర్ మే9,ప్రభాతవార్త : ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల 80 వ కాలేజీ డే ఉత్సవాలు రాజేంద్ర నగర్ లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ తిరుమలాదేవి ఈద ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల్ని ఉద్దేశించి ప్రసంగించారు. తాను 40 ఏళ్ల క్రితం కమ్యూనిటీ సైన్స్ బీ ఎస్ సీ, ఎం ఎస్ సీ కోర్సు లు ఈ విశ్వవిద్యాలయం లోనే చదివానన్నారు. క్రమశిక్షణ, విలువలు ఈ సంస్థ నుంచే నేర్చుకున్నానని.. తాను ఇప్పుడు ఎంత ఉన్నత స్థానంలో ఉన్నా ఈ విశ్వవిద్యాలయం లో నేర్చుకున్న మంచి అంశాలే తనను నడిపిస్తున్నాయని తిరుమలా దేవి వివరించారు. పౌష్టికాహారం, వంటలు, టెక్స్ టైల్స్ వంటి కీలక సబ్జెక్ట్ లు తాము ఆనాడు హోమ్ సైన్స్ కోర్సు లో చదివామని వివరించారు. నేడు ప్రతి ఒక్కరూ శారీరక సౌష్టవం గురించి మాట్లాడుతున్న తరుణాన ఆ కోర్సు ఎంత ఉపయుక్తం గా ఉంటుందో ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. విశ్వ విద్యాలయం లో వృద్ధులకి వెల్ నెస్ సెంటర్ ప్రారంభించడం వంటి అనేక మంచి కార్యక్రమాలు చేపట్టినందుకు ఉప కులపతి అల్దాస్ జానయ్య ని జస్టిస్ తిరుమలాదేవి అభినందించారు. మొబైల్ కారణం గా ప్రపంచమే మనిషి చేతిలో ఉంటున్న ఈ కాలం లో మానవత్వం, క్రమ శిక్షణ లు కలిగి సమాజం లో మంచి మనుషులు గా గుర్తింపు పొందాలని జస్టిస్ తిరుమలాదేవి విద్యార్థుల కి సూచించారు. ముగ్గురు ప్రధాన మంత్రులు, ఒక ఉప రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రారంభం అయిన ఈ విశ్వవిద్యాలయం అనేక రంగాలకి ఎందరో ప్రముఖులని ఆందించిందని అల్దాస్ జానయ్య అన్నారు. ఈ విశ్వ విద్యాలయం విద్యార్థినైన తాను ఉపకులపతి బాధ్యత లు చేపట్టిన తర్వాత విద్యార్థుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టానని వివరించారు. వాటిలో కొన్ని కఠినం గా అనిపించినా విద్యార్థుల బాగు కోసమే ఆ నిర్ణయాలు తీసుకున్నామని, విద్యార్థులు అది అర్థం చేసుకోవాలని విశ్వ విద్యాలయాలు విజ్ఞాన, పరివర్తన, సంస్కరణ కేంద్రాలని వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత విద్యార్థుల పైననే ఉందని అభిప్రాయపడ్డారు.కార్యక్రమం లో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి. నరేంద్ర రెడ్డి కళాశాల ప్రగతి నివేదిక ని సమర్పించారు.బీ ఎస్ సీ పూర్తి చేసిన కొందరు విద్యార్థులు తమ కళాశాల అనుభవాలని వివరించారు.ఈ సందర్భంగా కాలేజీ మ్యాగజైన్ సీడీని అతిథులు విడుదల చేశారు.వివిధ పోటీలలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకి బహుమతులు ప్రధానం చేశారు. విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అమితంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం లో రిజిస్ట్రార్ డాక్టర్ బి. ని. దిబీ. విద్యాసాగర్, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ కె. ఝాన్సీ రాణి, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ సి. హెచ్. వేణుగోపాల రెడ్డి, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ కె. బి. ఈశ్వరి, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి. నరేంద్ర రెడ్డి,కళాశాల విద్యార్థి వ్యవహారాల ఇంచార్జి డాక్టర్ వి. రామ్ రెడ్డి, బోధన, బోధనేతరసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విఠల్ బహుముఖ ప్రజ్ఞాశాలి : మాజీ ఎంపి టీజీ వెంకటేష్

కౌటికే విఠల్ ను నియామకపత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎంపీ

చిక్కడపల్లి మే 9 (ప్రభాతవార్త) : ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ సలహాదారులుగా ప్రముఖ చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ సలహాదారు, ప్రముఖ సామాజిక సేవకులు కౌటికే విఠల్ నియమితుల య్యారు. శనివారం జరిగిన ప్రత్యేక సమావేశంలో సంస్థ గ్లోబల్ చైర్మన్, మాజీ ఎంపీ టీ. జీ. వెంక టేష్ ముఖ్య అతిథిగా హాజరై కౌటికే విఠల్ కు నియామక పత్రాన్ని అందజేసిసత్కరించి, మాట్లాడారు. కౌటికే విఠల్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ఎన్నో సంవత్సరాలుగా భారతదేశంలో చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ సలహా దారులలో అగ్రస్థానంలో కొనసాగుతున్నారని తెలిపారు. తమ పాలసీదారుల జన్మదినోత్సవాల సందర్భంగా ప్రతి సంవత్సరం వెయ్యి మందికి ఉచిత అన్న దానం నిర్వహిం చడం, చలికాలం లో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం, ఎండాకా లంలో వేలాది మందికి ఉచితంగా నీటి బాటిళ్లు అందించడం వంటి అనేక సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో విశేషగుర్తింపు పొందారని పేర్కొన్నారు. అధ్యక్షత వహించిన న్యాయవాది మదుపల్లి రవిగుప్త మాట్లా డుతూ కౌటికే విఠల్ పట్టుదల, కార్యద క్షతకు ప్రతీక అని అన్నారు. ఏ బాధ్యత చేపట్టినా సం పూర్ణ నిబద్ధతతో నిర్వహి స్తారని కొనియాడారు. అనంతరం కౌటికే విఠల్ మాట్లాడుతూ ప్రపంచ ఆర్య వైశ్య మహాసభలో ఆరు సంవత్సరాలు పూర్వాధ్యక్షుడిగా, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, జాతీయ సలహాదా రుగా సేవలందించిన విషయా న్ని గుర్తు చేశారు. జాతీయ సలహాదారుగా దేశవ్యాప్తంగా నిర్వ హించిన సేవా కార్య క్రమాల గురించి క్లుప్తంగా వివరించారు. భారతీయ జీవిత బీమా సంస్థ సీనియర్ మోస్ట్ ఏజెంట్, ఏజెంట్ల నాయకుడు బి.ఎన్. చారి మాట్లాడుతూ.. కౌటికే విఠల్ ప్రతిరోజూ కొత్త రికా ర్డులు సృష్టిస్తూ ప్రతి సంవ త్సరం నంబర్ వన్ స్థానాన్ని నిలబె ట్టుకుంటున్నారని అభినందించారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులందరికీ కౌటికే విఠలను సన్మానించి, కృతజ్ఞతలు తెలియజేశారు.

చెరువుల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం

- నీటి పారుదల శాఖ ఎస్.ఇ శ్రీనివాస్

వట్టినాగులపల్లిలో ఏర్పాటు చేసిన రైతు వారము కార్యక్రమంలో పాల్గొన్న నీటి పారుదల శాఖ అధికారులు, రైతుల దృశ్యం.

నార్సింగి, మే 9 ప్రభాతవార్త : గండిపేట మండలంలోని చెరువుల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని నీటి పారుదల శాఖ ఎస్.ఇ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం వట్టినాగులపల్లిలోని వార్డు కార్యాలయం వద్ద రైతు వారము కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎస్.ఇ శ్రీనివాస్ మాట్లాడుతూ గొలుసు కట్టు చెరువులను పరిరక్షించుకునేందుకు, చెరువుల్లోకి వరద నీరు మోసుకు వచ్చే కాలువలను కబ్జాల చెర నుంచి విడిపిస్తామని స్పష్టం చేశారు. చెరువుల భూమిలో, బఫర్ జోన్‌లో ఎక్కడా కూడా నిర్మాణాలు చేపట్టకూడదని, కేవలం పంటలు పండించుకోవాలని సూచించారు. చెరువుల భూములు, వరద కాలువల భూములు కబ్జాలకు గురైతే వెంటనే మా నీటి పారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకు రావాలని రైతులకు, ప్రజలకు సూచించారు. చెరువులను కాపాడుకుంటే భూగర్భ నీటి మట్టం పెరుగుతుందని, ప్రజలకు అవసరమైన నీరు అందుతుందన్నారు. వర్షాకాలంలో కురిసిన వర్షపు నీరు భూమిలో ఇంకడం లేదని, కాంక్రీట్ జంగల్‌గా గ్రామాల్ని మారడం వలన నీరంత దిగువ ప్రాంతాలకు వెళ్లిపోతుందన్నారు. వట్టినాగులపల్లిలోని గౌని చెరువు, ఎర్రకుంట, తూముకుంట, కొత్త చెరువుల వద్దకు అధికారులు వెళ్లి పరిశీలించారు. ఈ చెరువుల్లోకి వరద నీటిని తెచ్చే కాలువలను సైతం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ అధికారులు సురేష్ బాబు, రమ, నరేందర్, లక్ష్మారెడ్డి, రైతులు ముత్యంరెడ్డి, చుక్కయ్య, రాఘవరెడ్డి, తారాసింగ్, బాల్‌రాజ్, వెంకటేష్, దర్శన్, శేఖర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సంగీత విభావరికి ముగ్ధులైన కళాప్రియులు

-ఆరభి సంస్థ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

సమావేశంలో మాట్లాడుతున్న వెంకయ్య నాయుడు

మాదాపూర్, మే 9 (ప్రభాత వార్త): సంగీతానికి ఎల్లలు లేవని, అది సుమధురం, రసవత్తరం, మహత్తరమని భారత పూర్వ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని శిల్పకళ వేదికలో జరిగిన ఆరభి ది సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ 28వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.నాద పరంపర పేరుతో నిర్వహించిన ఈ విశిష్ట కార్యక్రమంలో 150 మంది వయోలిన్ కళాకారులు పాల్గొని గ్రాండ్ వయోలిన్ సింఫనీతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. కళారత్న డాక్టర్ అశోక్ గుర్జాలే సంగీత దర్శకత్వంలో గంటన్నర పాటు సాగిన ఈ సంగీత మహోత్సవం కళాప్రియులకు అపూర్వ అనుభూతిని కలిగించింది.జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన వెంకయ్య నాయుడు మాట్లాడుతూ చిన్నారుల నుంచి సీనియర్ కళాకారుల వరకు అందరూ కలిసి అందించిన ఈ సంగీత కచేరి భారతీయ సంగీత వారసత్వానికి ప్రతీకగా నిలిచిందన్నారు. కీర్తనలు వింటూ తాను భావోద్వేగానికి గురయ్యానని, తెలియకుండానే ఆనందభాష్పాలు వచ్చాయని పేర్కొన్నారు.భారతీయ సంగీతం ఒక తపస్సు అని, సంగీత సాధనలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు. అన్నమయ్య, త్యాగయ్య, కట్ట బొమ్మన, ఝాన్సీ రాణి లాంటి మహనీయుల గురించి మన చరిత్ర పాఠాల్లో తక్కువగా ఉందని, దేశాన్ని దోచిన అలెగ్జాండర్, రాబర్ట్ క్లైవ్ గురించి ఎక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం పద్మశ్రీ డాక్టర్ ఎల్లా వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఆరభి సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ అశోక్ గుర్జాలే ఐదు దశాబ్దాలుగా అందిస్తున్న సంగీత సేవలను కొనియాడారు. ప్రముఖ మృదంగ విద్వాంసులు పాలకుర్తి రామచంద్ర శర్మను మృదంగ నాద విభూషణ బిరుదుతో ఘనంగా సత్కరించారు.ఈకార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ దీపిక రెడ్డి, డాక్టర్ దారూరి రాఘవాచారి, త్రిచూర్ బ్రదర్స్ రాంకుమార్ మోహన్, డాక్టర్ జొన్నలగడ్డ అనురాధ, కలెక్టర్ స్నేహ శబరీష్, సినీ నటుడు తనికెళ్ళ భరణి తదితరులు పాల్గొన్నారు. వాతాపి గణపతిమ్ భజేతో ప్రారంభమైన ఈ సంగీత విభావరి బ్రహ్మకడిగిన పాదము, బంటురీతి కొలువు, నగుమోము, బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే, పలుకే బంగారమాయేనా వంటి అనేక శాస్త్రీయ కీర్తనలతో సంగీతాభిమానులను అలరించింది. అనంతరం ఫ్యూజన్ సంగీత ప్రదర్శనలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి.నాలుగేళ్ల చిన్నారి శ్రీకరి నుంచి యువ, సీనియర్ కళాకారుల వరకు పాల్గొన్న ఈ గ్రాండ్ వయోలిన్ సింఫనీ ఆద్యంతం సంగీత మాధుర్యాన్ని పంచింది. చివరగా ఆరభి సంస్థ సంగీత విద్యార్థులు తమ గురువు డాక్టర్ అశోక్ గుర్జాలేను ఘనంగా సత్కరించారు.

11నుండి మండలంలో విద్యా వారోత్సవాలు

-ఎంఈఓ శంకర్ రాథోడ్

అత్తాపూర్ మే9 ,ప్రభాతవార్త : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఇందులో భాగంగా రాజేంద్రనగర్ మండలంలో విద్యా వారోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ పేర్కొన్నారు.శనివారం ఎంఈఓ శంకర్ రాథోడ్ ఓ ప్రకటనలో మాట్లాడుతూ... స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ మండల పరిధిలోని ఈనెల 11వ తేది నుండి 17వ తేది వరకు విద్యా వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.11న ఫౌండేషన్ దే కార్యక్రమాలు,12న పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షల కోసం రివిజల్ కార్యక్రమాలు,13న నియోజకవర్గ స్థాయిలో పాఠశాల విద్యా నిర్వహణపై సర్పంచ్‌లకు సదస్సు,14న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట,15న గ్రంథాలయ నిర్వహణ ,16న ఆర్ట్స్ అండ్ కల్చరల్ ,17న విద్యార్థుల విజయోత్సవాలు నిర్వహించనున్నామని ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,యువజన సంఘాలు,విద్యార్థి సంఘాలు నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బిఎంటిపై బసవతారకంలో నర్సింగ్ సదస్సు

సదస్సును ప్రారంభిస్తున్న జేఎస్ఆర్ ప్రసాద్, చిత్రంలో ఇతర వైద్యులు ఉన్నారు.

జూబ్లీహిల్స్, మే 9, ప్రభాతవార్త: బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రిలో 'బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్(బిఎంటి) నర్సింగ్- విజ్ఞానం, ఆచరణల మధ్య వారధి' అనే అంశంపై శనివారం ఒక రోజు నర్సింగ్ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 250 మంది నర్సింగ్ నిపుణులు హాజరయ్యారు. సదస్సును ట్రస్ట్ బోర్డు సభ్యులు జేఎస్ఆర్ ప్రసాద్, అసోసియేట్ డైరెక్టర్ డా. కల్పనా రఘునాథ్, మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డా. సెంథిల్ జే. రాజప్ప, మెడికల్ సూపరింటెండెంట్ డా. ఫణి కోటేశ్వరరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ కందుల శ్రీవాణి తదితరులు ప్రారంభించారు. డా. కల్పనా రఘునాథ్, ఆంకాలజీ నర్సింగ్‌లో పనిచేసే నర్సులు నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. డా. సెంథిల్ రాజప్ప మాట్లాడుతూ బిఎంటి సంరక్షణలో ఆధారాధారిత వైద్య విధానాలను నర్సులు సమర్థంగా అమలు చేయాలన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన జేఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ ఆస్పత్రిలో ఇప్పటివరకు 700కు పైగా బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ చికిత్సలు విజయవంతంగా నిర్వహించామని, అందులో 200 చిన్నారుల కేసులు ఉన్నాయన్నారు. ఈ విజయాల్లో నర్సింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషించారని అభినందించారు. సదస్సులో టాటా మెమోరియల్ హాస్పిటల్, రాజీవ్ గాంధీ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ తదితర జాతీయ సంస్థలకు చెందిన నిపుణులు కండిషనింగ్ రెజిమెన్లు, కార్ట్ సెల్ థెరపీ, ట్రాన్స్‌ప్లాంటేషన్ సమస్యలు, సపోర్టివ్ కేర్ నర్సింగ్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై మాట్లాడారు. ఈ సదస్సు ద్వారా బిఎంటి నర్సింగ్‌లో ఆధునిక వైద్య విధానాలు, రోగి సంరక్షణలో నర్సుల కీలక పాత్రపై అవగాహన పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.

వాక్ ఫర్ వాటర్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం : సీతారాం ధూళిపాళ

మణికొండలో "వాక్ ఫర్ వాటర్" కరపత్రంను విడుదల చేస్తున్న బిఆర్ఎస్ నాయకుల దృశ్యం.

నార్సింగి, మే 9 ప్రభాతవార్త : మణికొండ, నెక్‌నాంపూర్ డివిజన్ల ప్రజలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17.వ,తేదీన బిఆర్ఎస్ ఆధ్వర్యంలో "వాక్ ఫర్ వాటర్" కార్యక్రమాన్ని చేపడుతున్నామని బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ పేర్కొన్నారు. శనివారం మణికొండలో వాక్ ఫర్ వాటర్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రంను బిఆర్ఎస్ నాయకులు ఉపేంద్రనాథ్‌రెడ్డి, లక్ష్మణ్‌రావ్‌లతో కలిసి సీతారాం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్య పరిష్కారం కోసం రాజేంద్రనగర్ బిఆర్ఎస్ ఇంచార్జి పి.కార్తిక్‌రెడ్డి నాయకత్వంలో వాక్ ఫర్ వాటర్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 17.వ, తేదీన సాయంత్రం 4:30.గంటలకు నెక్‌నాంపూర్ చింతచెట్టు బటర్‌ప్లై కూడలి నుంచి మర్రిచెట్టు కూడలిలోని జలమండలి కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ కార్యక్రమం ఉంటుందని వివరించారు. మనం ఏ పని చేయాలన్నా నీరు అవసరం ఉంటుందని, ప్రజలకు అవసరమైన మంచినీటిని సరఫరా చేయడంలో అధికారగణం ఘోరంగా విఫలం అవుతుందన్నారు. ప్రజలు ఇళ్లల్లో వేసుకున్న బోర్లన్నీ ఎండిపోయాయని, జల మండలి నుంచి సరఫరా చేస్తున్న నీరు సన్నని ధారవలే వస్తుందని, వాడుకునేందుకు, తాగేందుకు నీరు లేక మణికొండ, నెక్‌నాంపూర్ డివిజన్ల ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. ప్రజల పక్షాన బిఆర్ఎస్ చేపడుతున్న వాక్ ఫర్ వాటర్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

యువ వైద్యులకు న్యూరో సైన్సెస్‌లో మాస్టర్ శిక్షణ

శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్య బృందం

సికింద్రాబాద్, మే 9 ప్రభావార్త: న్యూరాలజీ, న్యూరోసర్జరీ విభాగాల్లో వస్తున్న ఆధునిక మార్పులు, అత్యాధునిక చికిత్సా విధానాలపై యువ వైద్యులకు అవగాహన కల్పించేందుకు శనివారం సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కళాశాల అలుమ్ని ఆడిటోరియంలో మాస్టర్ క్లాస్ ఇన్ న్యూరాలజీ న్యూరోసర్జరీ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. రెనోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోలాజికల్ సైన్సెస్ (ఆర్ఐఎన్ఎస్) న్యూరాలజీ, న్యూరోసర్జరీ విభాగాలు, గాంధీ ఆసుపత్రి న్యూరాలజీ, న్యూరోసర్జరీ విభాగాలు, పాన్ రీసెర్చ్ ఫౌండేషన్, తెలంగాణ న్యూరోసైన్సెస్ సొసైటీ (టీఎన్ఎస్) సంయుక్త ఆధ్వర్యంలో ఈ రెండు రోజుల శిక్షణా సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణా సదస్సులో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 80 మందికి పైగా పీజీ వైద్య విద్యార్థులు, రెసిడెంట్ డాక్టర్లు హాజరయ్యారు. కార్యక్రమాన్ని తెలంగాణ న్యూరోసైన్సెస్ సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ డా. ధైర్యవాన్, సెక్రటరీ డా. ఎన్. ప్రతాప్ కుమార్, నిమ్స్ మాజీ డైరెక్టర్ డా. డి. రాజా రెడ్డి, రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీఓఓ రవీంద్రనాథ్ గరగ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా సదస్సు నిర్వహణ అధ్యక్షుడు డా. జె.ఎం.కె. మూర్తి, నిర్వహణ కార్యదర్శులు డా. టి.వి.ఆర్.కె. మూర్తి, డా. సయ్యద్ అమీర్ బాషా పస్పాల మాట్లాడుతూ న్యూరాలజీ, న్యూరోసర్జరీ విభాగాల్లో పీజీ చదువుతున్న వైద్య విద్యార్థులు, రెసిడెంట్ డాక్టర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ మాస్టర్ క్లాస్ ద్వారా వారి క్లినికల్ నైపుణ్యాలను మెరుగుపరచడమే లక్ష్యమని తెలిపారు. రోగుల నిర్ధారణకు సంబంధించిన ప్రాథమిక పరీక్షా విధానాలు, క్లినికల్ కేస్ డిస్కషన్స్, మాక్ ఎగ్జామినేషన్ సెషన్ల ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సు నిర్వహణలో గాంధీ ఆసుపత్రి న్యూరోసర్జరీ విభాగాధిపతి ప్రొఫెసర్ కె. శ్రీనివాస్, ప్రొఫెసర్ కె. రవి, న్యూరాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్. రమేష్ కీలక పాత్ర పోషించడమే కాకుండా, విద్యార్థులకు తమ అమూల్యమైన సూచనలు అందించారు. సీనియర్ ప్రొఫెసర్లు తమ అనుభవాలను పంచుకుంటూ, పరీక్షల సమయంలో విద్యార్థులు పాటించాల్సిన మెళకువలను వివరించారు. హైదరాబాద్‌తో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రతిష్టాత్మక వైద్య సంస్థలకు చెందిన సీనియర్ అధ్యాపకులు ఈ సెషన్లలో బోధకులుగా వ్యవహరించారు. బోధనాత్మక ఉపన్యాసాలు, ప్రాక్టికల్ ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. వైద్య విద్యార్థులలో క్లినికల్ ప్రాక్టీస్‌పై సమగ్ర అవగాహన కల్పించేందుకు రెనోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోలాజికల్ సైన్సెస్ (ఆర్ఎన్ఐఎస్) నిరంతరం కృషి చేస్తోందని, భవిష్యత్తులోనూ ఇలాంటి మరిన్ని విద్యా సదస్సులను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సంయుక్త నిర్వహణ కార్యదర్శులు డా. మురళీధర్ రెడ్డి , డా. లలిత పి, పలువురు సీనియర్ న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్లు పాల్గొన్నారు.

చైతన్యానికి ప్రతీక బుర్రకథ

..ఆచార్య కొలకలూరి ఇనాక్

బుర్రకథ కళాకారులను సత్కరిస్తున్న శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్సలర్, పద్మశ్రీ ఆచార్య కొలకనూరి ఇనాక్, చిత్రంలో త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి తదితరులు

చిక్కడపల్లి మే 9 (ప్రభాతవార్త) : తెలుగు నేల గర్వించదగ్గ అద్భుతమైన కళా ప్రక్రియ బుర్రకథ అని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్సలర్, పద్మశ్రీ ఆచార్య కోలకనూరి ఇనాక్ కొనియాడారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని గుండవరపు హనుమంతరావు కళా వేదికలో గాన సభ నిర్వహణలో గాన సభ పూర్వ అధ్యక్షుడు కళా సుబ్బారావు జయంతి సందర్భంగా ఏడు రోజుల పాటు ప్రముఖులైన కళా కారులచే బుర్ర కథ సప్తాహంలో నక్క ఉప్పలయ్య బృందం చే సీతాకళ్యాణం అద్భుతంగా నిర్వహించారు. గానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచార్య కోలకనూరి ఇనాక్ మాట్లాడుతూ సాంఘిక చైతన్యానికి, చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి బుర్రకథ ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. తెలుగు జానపద కళారూపాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో గానసభ నిర్వాహకులు ఏర్పాటు చేయడం విశేషమని అన్నారు.కళాకారులను ఆదరిస్తున్న గానసభ అధ్యక్షుడు జనార్ధన మూర్తి అభినందనీయులని అన్నారు. కార్యక్రమంలో గానసభ పాలకమండలి సభ్యుడుశ్రీనివాస్ పాల్గొన్నారు.

కేబీఆర్ ఉద్యానవనం వద్ద బిఆర్ఎస్ ఆందోళన

ఆందోళన నిర్వహిస్తున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి, ఇతర బిఆర్ఎస్ నేతలు

జూబ్లీహిల్స్, మే 9, ప్రభాతవార్త: హెచ్-సిటీ పేరుతో కేబీఆర్ ఉద్యానవనం చుట్టూ చెట్లను నరకడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం కేబీఆర్ ఉద్యానవనం ముందు ఆందోళన నిర్వహించారు. ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, జార్వల నవీన్‌నాయక్‌ల ఆధ్వర్యంలో ఇక్కడ ప్లకార్డులు, ఫ్లెక్సీలు పట్టుకొని ఆందోళన చేపట్టారు. చెట్ల నరికివేతను నిలిపివేయాలని, అభివృద్ధి పేరుతో చెట్లను నరికివేయడం దారుణమని మన్నె గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వానికి పచ్చ దనంపై ఒక స్పష్టమైన వైఖరి లేదని, అందుకో ఎన్నో ఏళ్ల నుంచి నీడనిస్తున్న చెట్లను తొలగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

మోడీ సభను విజయవంతం చేయాలి : తోకల శ్రీనివాస్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి

చార్మినార్,మే 9 ప్రభాతవార్త :
మైలార్‌దేవ్‌పల్లి కాటేదాన్ బిజెపి పార్టీ కార్యాలయంలో శనివారం రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు,రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జీ తోకల శ్రీనివాస్ రెడ్డి నియోజకవర్గానికి చెందనముఖ్య నాయకులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం జరగనున్న బహిరంగ సభకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విచ్చేయనున్నారని,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ నుంచి 30 బస్సులు,150 కార్లు,మూడు వేలు పైగా జన సమీకరణతో బయలు దేరాలని తెలిపారు.పరేడ్ గ్రౌండ్ రంగ సభను విజయవంతం చేయాలని ఆయన బిజెపి నాయకులను కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బుచ్చిరెడ్డి,అడికే జనార్దన్,బబ్లూ, ఎల్‌వి రెడ్డి,పృథ్వీరాజ్,బొల్ల రామకృష్ణ,కృష్ణ జయంతి, అంజమ్మ,ఎండి షకీల్,సురేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

కిడ్నాప్ వ్యవహారంలో రౌడీషీటర్లు!

- టాస్క్‌ఫోర్స్ అదుపులో ఐదుగురు నిందితులు

జూబ్లీహిల్స్, మే 9, ప్రభాతవార్త:
ప్రేమ వ్యవహారంలో కిడ్నాప్‌కు పాల్పడి డబ్బులు దండుకున్న ముఠాలోని అయిదుగురు సభ్యులు టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. ఈ ముఠాలో ఇద్దరు నిందితులు రౌడీషీటర్లుగా ఉన్నట్లు తెలుస్తుంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. పోలీసులమంటూ కొందరు వ్యక్తులు నిఖిల్, సాయి, మహేష్‌లను కిడ్నాప్ చేసి మొయినాబాద్ సమీపంలో దాడికి పాల్పడి వారి నుంచి రూ. 33లక్షలకుపైగా వసూలు చేసిన విషయం విదితమే. ఈ సంఘటనలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు అయిదుగురు నిందితులను అదుపులోకి తీసుకోగా వారిలో ఇద్దరు రౌడీషీటర్లు ఉన్నట్లు గుర్తించారు. కాగా ప్రేమ వ్యవహారంలో యువతి గతంలో నిఖిల్‌పై కేసు పెట్టడంతో అతను కోర్టు నుంచి అరెస్ట్ చేయకుండా ఆర్డర్ తీసుకున్నారు. ఈ క్రమంలోనే నిఖిల్‌కు బుద్ది చెప్పాలని ఈ ముఠా సహకారం తీసుకొంది. ఈ క్రమంలోనే ముఠా డబ్బు వసూలుకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. నిందితుల నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా నిందితులు అదుపులో ఉన్నట్లు పోలీసులు ధృవీకరించలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నామని బంజారాహిల్స్ పోలీసులు స్పష్టం చేశారు.

నవ కంటోన్మెంట్‌గా మార్చేందుకు చర్యలు: ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్ పురాలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్,మే 9 ప్రభతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకొని నవ కంటోన్మెంట్ నిర్మాణ బాటలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. శనివారం 2వ వార్డు రసూల్ పురా ఇందిరమ్మ నగర్ పరిసర ప్రాంతాల్లో కంటోన్మెంట్ బోర్డు అధికారులతో కలిసి పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సాంసన్‌రాజు, వి.నరేశ్, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తుంది : ఎంపీ ఈటల

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటెల రాజేందర్

కంటోన్మెంట్,మే 9 ప్రభతవార్త: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 3వ సారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటి సారిగా హైదరాబాద్‌కు విచ్చేస్తున్న సందర్భంగా ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో తలపెట్టనున్న బారీ బహిరంగ సభకు ప్రజలు స్వచ్ఛందంగా విచ్చేస్తున్నారని మల్కాగిరి ఎంపీ ఈటెల రాజేందర్ తెలిపారు. శనివారం మడ్‌ఫోర్ట్ గాయిత్రి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బిఆర్ఎస్.కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు, దోపిడీలకు పాల్పడ్డాయని ఆరోపించారు. రాష్ట్రంలో నియంతృత్వ పోకడలకు స్వస్తిచెప్పి దేశం,రాష్ట్రాల అభివృద్ధికి బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారని తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని కంటోన్మెంట్, ఎల్బీ నగర్,ఉప్పల్, మేడ్చల్, కుత్బుల్లాపూర్,కూకట్‌పల్లి ప్రాంతాల నుంచి లక్ష మంది ప్రజలు మోదీ సభకు విచ్చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబ బానుక నర్మధ మల్లికార్జున్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బానుక మల్లికార్జున్, మహంకాలి జిల్లా ఉపాధ్యక్షులు బి.ఎన్.శ్రీనివాస్, నాయకులు విజయానంద్,నర్సింగ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ సభను జయప్రదం చేయాలని ప్రచారం

మోదీ సభకు రావాలని ప్రచారం చేస్తున్న దేవర వంశీ..

కార్వాన్,మే9(ప్రభాతవార్త) ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 10న హైదరాబాద్‌లో పర్యటించనున్న సందర్భముగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొననున్నారు.ఈ సభను విజయవంతం చేయడానికి బీజేపీ రాష్ట్ర నాయకత్వం భారీగా జనసమీకరణ చేస్తోంది,ఇందులో భాగంగా గుడిమల్కాపూర్ డివిజన్ పరిధిలో బీజేపీ సీనియర్ నాయకులూ దేవర వంశీ ఆధ్వర్యంలో బస్తీలలో పర్యటిస్తూ ఇంటిటి,గడప గడప ప్రచారం ముమ్మరం చేసి ప్రధాని పాల్గొనే సభకు హాజరై బహిరంగ సభను జయప్రదం చెయ్యాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు యాదగిరి,శ్రీధర్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బిసిల అభివృద్ధికి విహెచ్ నిరంతరం పోరాటం

విహెచ్ దీక్షకు లక్‌పతి యాదగిరిగౌడ్ మద్దతు



ప్రభుత్వ సలహాదారులు హనుమంతరావుకు సంఘీభావం తెలుపుతున్న టీపీసీసీ మాజీ కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్

హైదరాబాద్, మే 9 ప్రభాతవార్త

మాజీ రాజ్యసభ సభ్యుడు, ప్రభుత్వ సలహాదారుడు వి.హనుమంతరావు నిరంతరం బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని టిపిసిసి మాజీ కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్ అన్నారు.శనివారం హనుమంతరావు అంబర్‌పేటలోని తన నివాసం వద్ద చేపట్టిన దీక్షకు లక్‌పతి యాదగిరి గౌడ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జనగణలో భాగంగా ఓబీసీ లెక్కించాలన్నారు. హనుమంతరావు చేపడుతున్న దీక్షకు అన్ని రాజకీయ పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొల్లు కిషన్ పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీతో రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీ

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు

కంటోన్మెంట్,మే 9 ప్రభతవార్త: అంతర్జాతీయ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులతో ఈ నెల 9,10 తేదీల్లో హైదరాబాద్‌లో అంతర్జాతీయ ఆర్థోపెడిక్ 500 మది వైద్య నిపుణులతో సదస్సు నిర్వహిస్తున్నామని సికింద్రాబాద్ మెడికవర్ అసుపత్రి ఆర్థోపెడిక్ హెడ్, ఛీఫ్ రోబిటిక్ జాయింట్ రీప్లేస్ మెంట్ సర్జన్ డాక్టర్ ఉదయ్ నక్రిష్ణ మైనేని తెలిపారు. శనివారం సికింద్రాబాద్ మెడికవర్ ఆసుపత్రిలో రోబోటిక్ అసిస్టెడ్ హిప్ రీప్లేస్ మెంట్ అంశంపై రెండు రోజుల పాటు జరిగే సదస్సుకు దేశ వ్యాప్తంగా 500లకు పైగా ఆర్థోపెడిక్ సర్జన్లు పాల్గొనున్నట్లు అయన తెలిపారు. తెలంగాణ ఆర్థోపెడిక్ అసోసియేషన్, ట్విన్ సిటీస్ అర్థోపెడిక్ సొసైటీ,తెలంగాణ ఆర్థ్రోప్లాస్టీ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో నిర్వహించే ఈ సదస్సుకు ఆమెరికాలోని న్యూయార్కుకు చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ అండ్రూబి. విక్‌లైన్ ఈ సదస్సులో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రోబోటిక్ హిప్ రీప్లేస్ మెంట్ సర్జరీలు క్లిష్టంటా ఉంటాయన్నారు. చాలా మంది రోగులు చివరి దశలో వైద్యులను సంప్రదిస్తారని, అప్పటికే ఎముకల బలం తగ్గిపోతుందన్నారు. రోబోటిక్ సర్జరీ ద్వారా హింప్లాంట్‌ను అమర్చడం వద్ద మంచి ఫలితాలు సాధించగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ సర్జన్‌లు డాక్టర్ రాజుకుమార్, యూనిట్ హెడ్ క్రిష్ణవేణి,డాక్టర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల ప్రజలకు కేంద్రం ముద్ర రుణాలు మంజూరు చేయాలి

సైఫాబాద్, మే 9 ప్రభాతవార్త: ఉభయ తెలుగు రాష్ట్రాలలో ముద్ర రుణాలు మంజూరులో కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసిందని తెలంగాణ రైతు రక్షణ సమితి ఆవేదన వ్యక్తం చేసింది. ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం హైదరాబాద్ నగరానికి వస్తున్న సందర్భంగా బిజెపి నాయకులు సంబురాలు చేసుకోవడం కాదని, ముద్ర రుణాల మంజూరులో జరిగిన అన్యాయాన్ని తెలియజేసి, రుణాలు ఇప్పించేందుకు కృషి చేయాలని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి కూడా బాధ్యత ఉందని రక్షణ సమితి గుర్తు చేసింది. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు, వివిధ జిల్లాల ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర ఆర్థిక శాఖ ప్రతి ఏడాది ముద్ర రుణాల మంజూరుకై వివిధ రాష్ట్రాల్లోని బ్యాంకు టార్గెట్లు నిర్ణయిస్తుందని, దీనికి శాస్త్రీయ పద్ధతి పాటించకుండా ఇష్టారీతిలో కేంద్రం వ్యవహరించడంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు, నిరుద్యోగ

సమావేశంలో మాట్లాడుతున్న పాకాల శ్రీహరిరావు

యువతకు ముద్ర రుణాలు మంజూరు కాకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 71 లక్షల మంది, ఆంధ్రప్రదేశ్‌లో ఒక కోటి లక్ష మందికి ముద్ర రుణాలను మంజూరు చేసి నిరుద్యోగ యువతను, వ్యాపారులను ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో ప్రధాని నరేంద్రమోదీ జోక్యం చసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రక్షణ సమితి ప్రతినిధులు కే.రాఘవేంద రెడ్డి, ఎ.వెంకటేష్, విష్ణువర్ధన్‌రెరడిద్ర, శ్రీనివాస్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, మాణిక్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాచుపల్లి పెద్ద చెరువులోకి మురుగు నీరు

-ఆందోళన వ్యక్తం చేసిన ఆకుల సతీష్

నిజాంపేట్, మే 9, ప్రభాతవార్త

బాచుపల్లి ప్రాంతంలోని సుమారు 50 ఎకరాల విస్తీర్ణం కలిగిన మంచినీరు గల పెద్ద చెరువులోకి మురుగు నీరు కలుస్తుండటంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ తెలిపారు. 2024 సెప్టెంబర్ నెల నుండి ఇప్పటివరకు దాదాపు నాలుగు నుండి ఐదు సార్లు డ్రైనేజ్ లైన్ మాన్‌హోల్స్ పగిలిపోవడంతో భారీగా మురికినీరు చెరువులోకి చేరినట్లు ఆయన ఆరోపించారు.ప్రతి సారి తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టడం వల్ల సమస్య మళ్లీ మళ్లీ పునరావృతమవుతోందని ఆయన పేర్కొన్నారు. ఒకప్పుడు మంచినీటి చెరువుగా ఉన్న ఈ చెరువు ప్రస్తుతం మురుగు నీటి చెరువుగా మారుతున్న పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు.దీని వలన చెరువు పర్యావరణ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటోందనిపరిసర ప్రాంతాల్లో దుర్వాసన వ్యాపిస్తోందనిప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆకుల సతీష్ తెలిపారు.ఈ ఘటనలకు నిజాంపేట్ డిప్యూటీ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. పలు మార్లు

డ్రైనేజీ సమస్య వద్ద ఆకుల సతీష్

సమస్య పునరావృతమైనప్పటికీ శాశ్వత పరిష్కారం చేపట్టకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోందన్నారు.ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం, సంబంధిత అధికారులను ఉద్దేశించి వెంటనే క్రింది చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డ్రైనేజ్ మాన్‌హోల్స్, పైపులైన్లకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని,మురుగునీరు చెరువులోకి చేరకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.నిర్లక్ష్యం వహించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి చెరువు పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని కోరారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ విషయంలో అధికారులు తక్షణమే స్పందించాలని ఆకలి సతీష్ కోరారు.

హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం

సైఫాబాద్, మే 9 ప్రభాతవార్త: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి అమలు చేయడంలో విఫలం చెందిందని మజ్లీస్ ఇతెహాద్ మిల్లాత్ (ఎంఐఎం) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తాహెర్ కమల్ ఖుంద్మీరి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్, యువజన కాంగ్రెస్ నాయకుడు ఫిరోజ్‌ఖాన్‌లను సిఎం రేవంత్‌రెడ్డి విస్మరించారని శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చెప్పారు. ఎంఐఎం పార్టీతో ఉన్న సంబంధాల కారణంగా ఈ ఇద్దరూ నాయకులను రేవంత్‌రెడ్డి పట్టించుకోలేదని, కాంగ్రెస్, బిజెపి దొందు దొందేనని విమర్శించారు.

ధర్మారెడ్డి కాలనీలో ఉచిత క్యాన్సర్ శిబిరం...

కెపిహెచ్‌బి కాలనీ, మే 9, ప్రభాతవార్త

బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ సౌజన్యంతో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాకినేని యాకనారాయణ వినోద్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వసంత నగర్ డివిజన్ ధర్మారెడ్డి కాలనీలో శనివారం ఉచిత క్యాన్సర్ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైద్య పరీక్షల వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. డాక్టర్ పలువురికి వైద్య పరీక్షలు నిర్వ హించి అవసరమైన సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తూము వేణు, అరవింద్ రెడ్డి, శ్రీనివాస్ బాబు, సాయి తులసి, వాసు పాల్గొన్నారు.

వి.హెచ్.దీక్షకు మద్దతు తెలిపిన అనంద్ బాబు

కంటోన్మెంట్,మే 9 ప్రభతవార్త: జనగణనలో బీసీ వర్గాలకు 60 శాతం న్యాయ చేయాలని డామాండ్ చేస్తూ ప్రభుత్వ సలహాదారుడు,మాజీ ఎంపీ వి.హన్మంత్ రావ్, క తలపెట్టిన దీక్షకు శనివారం బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ ఆర్.ఆనంద్ బాబు గౌడ్,వైస్.చైర్మన్ డి.బి.దేవేందర్‌లు సంఘీబావం తెలిపారు. వి.హెచ్.తలపెట్టిన బిసీలకు 60 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన కోరారు.

బోగస్ ఓటర్లను తొలగించాలి : నక్క మధు

తుకారాంగేట్‌లో ఎస్.ఐ.ఆర్. హెల్ప్‌డెస్క్‌లో పాల్గొన్న తహశీల్దార్ అసదుల్లాఖాన్,నాయకులు నక్క మధు తదితరులు

కంటోన్మెంట్,మే 9 ప్రభతవార్త: కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) బోగస్ ఓటర్ల పేర్లను తొలగించాలని, ఇదే క్రమంలో నిజమైన ఓటర్లకు నష్టం కలుగకుండా చూడాలని అడ్డగుట్ట డివిజన్ బిఆర్ఎస్ నేత నక్క మధు విజ్ఞప్తి చేశారు. శనివారం తుకారాంగేట్ చౌరస్తాలో ఎస్.ఐ ఆర్.హెల్ప్ డెస్క్‌లో మారేడ్‌పల్లి తహశీల్దార్ అసదుల్లాఖాన్ పాల్గొని పలు సూచనలు ఇవ్వగా ఓటర్ల జాబితాలో నెలకొన్న సమస్యలు, తప్పు ఒప్పులను నక్క మధు అధికారుల దృష్టికి తెచ్చారు.

300 వారాలుగా నిరంతరాయంగా అన్నదానం

అన్నదానం స్కై ఫౌండుషన్ నిర్వాహకులు

సికింద్రాబాద్, మే 9 ప్రభావార్త: ఆకలి అనే రోగానికి అన్నమే పరమోషధమని నమ్మి, నగరంలోని అభాగ్యుల పాలిట ఆశాకిరణంగా నిలుస్తోంది స్కై ఫౌండేషన్ 2012 లో ఒక చిన్న సేవా దృక్పథంతో ప్రారంభమైన ఈ సంస్థ ప్రస్థానం నేడు 300వ అన్నదాన కార్యక్రమంతో అద్భుతమైన మైలురాయిని అధిగమించింది. ఫుట్‌పాత్‌లే ఇల్లుగా, ఆకాశమే కప్పుగా బతుకులీడుస్తున్న అనాథల ఆకలి తీర్చడమే లక్ష్యంగా గత 14 ఏళ్లగా ఈ సంస్థ నిరంతరాయంగా తన సేవలను కొనసాగిస్తోంది. సాధారణంగా అందరూ సెలవుగా భావించే ఆదివారాన్ని స్కై ఫౌండేషన్ సభ్యులు సేవా వారంగా మార్చుకున్నారు. ప్రతి నెల మొదటి ఆదివారం ఉచితంగా ఔషధాల పంపిణీ, మూడు, ఐదో ఆదివారాల్లో దుస్తుల పంపిణీ చేపడుతుండగా, రెండు, నాలుగో ఆదివారాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో అన్నదాని నిర్వహిస్తున్నారు. ఎక్కడో వండిన ఆహారం కాకుండా, స్వయంగా వంటశాల దగ్గరుండి శుచిగా సిద్ధం చేసిన వేడివేడి అన్నం, కూర, సాంబార్, మజ్జిగలను తాగునీటితో కలిపి ఒక కిట్ లాగా ప్యాక్ చేసి మరీ అందిస్తున్నారు. నగరంలోని చెట్ల కింద, చెత్తకుండీల వద్ద నివసించే నిరాశ్రయులను వెతుక్కుంటూ వెళ్లి ఈ ఆహార పొట్లాలు పంపిణీ చేయడం వీరి సేవా నిరతికి నిదర్శనం. సమాజంలో అత్యంత అట్టడుగున ఉన్న వారికి అండగా నిలవాలనే సంకల్పంతోనే ఈ ప్రస్థానం మొదలైందని స్కై ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వై. సంజీవ కుమార్ తెలిపారు. 300వ అన్నదాన కార్యక్రమం పూర్తి చేయడం తమ బాధ్యతను మరింత పెంచిందని, అభాగ్యుల ముఖాల్లో చిరునవ్వు చూడటమే తమకు అసలైన పురస్కారమని ఆయన పేర్కొన్నారు. ఆకలి లేని సమాజ స్థాపనే లక్ష్యంగా భవిష్యత్తులో ఈ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని సంస్థ ప్రతినిధులు స్పష్టం చేశారు.

మోడీ సభను విజయవంతం చేయాలి



కార్యాక్రమంలో పాల్గొన్న మర్రి శశిధర్‌రెడ్డి

కంటోన్మెంట్, మే 9 ప్రభావార్త: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో ఆదివారం జరగనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరుతూ శనివారం మోండా డివిజన్ లోని టకార బస్తి, మోండా మార్కెట్,పాలిక బజార్ ప్రాంతాలలో బిజెపి రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి పాదయాత్రలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర యువ నాయకులు మర్రి పురురవ రెడ్డి, మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమలి ఆనంద్, తాజా మాజీ కార్పొరేటర్ లు చీర సుచిత్ర, కొంతం దీపికా నరేష్ బిజెపి డివిజన్ అధ్యక్షులు సందీప్ వర్మ, ఇతర నాయకులు ళీ ళి మల్లేశ్, ఆకుల ప్రతాప్, బీరం నర్సింగ్ రావు, అనీష్ వర్మ,తారా చంద్ శర్మ, దయానంద్ రావు , గుంటి సత్యనారాయణ, బి. వికాస్, గోపి శ్రీనివాస్, కె. నరేష్, పార్ని పరమేశ్, ఆకుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి సమష్టి కృషి అవసరం : చైర్మన్ ఆంజనేయులు

తార్నాక, మే 9 ప్రభాతవార్త : నగరానికి విచ్చేసిన అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ చైర్మన్ ఆంజనేయులను జాతీయ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ గౌరవ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన సమాజ అభ్యున్నతి, గిరిజన ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, విద్యా మరియు ఉపాధి అవకాశాల విస్తరణతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు వంటి పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.దేశవ్యాప్తంగా గిరిజనుల సంక్షేమం కోసం అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం చేస్తున్న సేవలను జాటోతు హుస్సేన్ నాయక్ అభినందించారు. గిరిజన యువతలో అవగాహన, చైతన్యం పెంపొందించడంతో పాటు ప్రభుత్వ రంగాలలో గిరిజనులకు కల్పించిన రిజర్వేషన్లు, రాజ్యాంగబద్ధ హక్కులు పూర్తిస్థాయిలో అమలయ్యేలా సంఘం మరింత చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ, దేశంలోని వివిధ ప్రాంతాల్లో గిరిజన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి,

జాతీయ చైర్మన్ ఆంజనేయులును సన్మానిస్తున్న జాటోతు హుస్సేన్

వాటి పరిష్కారానికి సంఘం చేపడుతున్న కార్యక్రమాలను తెలియజేశారు. గిరిజనుల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధి కోసం పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఇద్దరు నాయకులు ఆకాంక్షించారు. స్నేహపూర్వక వాతావరణంలో జరిగిన ఈ సమావేశం ఎంతో ఆత్మీయంగా సాగిందని పి.వి. రమణ జాతీయ అధ్యక్షులుఅఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం పేర్కొన్నారు.

ఘనంగా గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ 165వ జయంతి

-అలరించిన రిమెంబరింగ్ ఠాగూర్ ప్రత్యేక సంగీత సాహిత్యం

నాంపల్లి, మే 9 ప్రభాతవార్త : విశ్వవిఖ్యాత గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ 165వ జయంతిని పురస్కరించుకుని ఆయన్ను స్మరించుకుంటూ రిమెంబరింగ్ ఠాగూర్ పేరుతో ప్రత్యేక సంగీత, సాహిత్య కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంగీతం, సాహిత్యం, నృత్యం, కవిత్వం సమ్మేళనంగా విచ్చేసి అశేష ప్రేక్షకులను తన్మయుల్ని చేసింది. జాతీయగీతంలో కార్యక్రమం ప్రారంభం కాగా బెంగాలీ సాంస్కృతికాభిమాని సంగమిత్ర మల్లిక్ తన రిమెంబరింగ్ ఠాగూర్ శ్రేణిలో మూడవభాగాన్ని సమర్పించారు. ఠాగూర్ గీతాలపూజా, ప్రేమ్, ప్రకృతి, విచిత్రో, నాట్య విభావరి విభాగాలకు చెందిన పలుగీతాలు ప్రదర్శింపబడ్డాయి, అమార్ ముక్తి ఆలోయ్ అలోయ్ గీతం, సంగమిత్ర త్యాగరాజస్వామి కృతి ఆధారంగా రూపొందిన లాబొన్నే పూర్ణప్రాణే గీతాలు హృద్యమంగా ఆలపించారు. ప్రకృతి విభాగంలో కమలిని శ్రీనివాస్ అందించిన నృత్యప్రదర్శనలు వీక్షకులను అబ్బు

రిమెంబరింగ్ ఠాగూర్ సంగీత సాహిత్య నృత్యప్రదర్శనలో ఓ దృశ్యం

రపరచగా కమిలిని సితార్ వాదనం సభికుల ప్రశంసలందుకుంది. తదుపరి ఠాగూర్ ప్రసిద్ధ రచన గీతాంజలి నుండి మూడు కవితలను కూడా అద్భుతం వినిపించారు. ఠాగూర్ గీతాల ఆధారంగా రూపొందిన హిందీ సినీగీతాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. చివరిగా ఆనందలోకే మంగళాలోకే ఆధ్యాత్మిక గీతంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

కంటోన్మెంట్ ప్రాంతాన్ని జిహెచ్‌ఎంసిలో విలీనం చేయాలి

కంటోన్మెంట్, మే 9 ప్రభావార్త: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతాన్ని వెంటనే జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలని, పెండింగ్‌లో ఉన్న సర్వీస్ ఛార్జీలను తక్షణమే విడుదల చేయాలని, నామినేట్ వ్యవస్థను రద్దు చేయాలి. కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ ప్రధానమంత్రిని డిమాండ్ చేసింది.ప్రధాన మంత్రి ఆదివారం పర్యటనకు వస్తున్న సందర్భంగా కంటోన్మెంట్ ప్రజలు విలీన అంశంపై స్పష్టమైన ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కంటోన్మెంట్ విలీనానికి సిద్ధమని ఇప్పటికే ప్రకటించినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత ఇవ్వకపోవడం ప్రజల్లో, ప్రజా సంఘాల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇప్పటివరకు బీజేపీ నాయకులు, కేంద్ర మంత్రులు కంటోన్మెంట్ ప్రాంతానికి వచ్చిన ప్రతిసారీ హామీలే ఇచ్చారని, ఒక్క నెలలో సర్వీస్ ఛార్జీలు విడుదల చేస్తాం అని చెప్పి సంవత్సరాలు

కార్యక్రమంలో మాట్లాడుతున్న నేతలు

గడిచిపోయినా ఇప్పటికీ రూ.1200 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని విమర్శించారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంకి రవీందర్, బోయిన్పల్లి మార్కెట్ ఎక్స్ చైర్మన్ ఖదీర్ వన్ రాజగోపాల్, డిస్టిక్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు జమీల్, డిస్టిక్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి సాంసన్ రాజ్, ఐదవ కాంగ్రెస్ అధ్యక్షుడు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి బిఎస్ రవి సేవలు అభినందనీయం

ఏఐఐఈఏ ప్రముఖులు ధర్మరాజ్ మహాపాత్ర , శ్రీకాంత్ మిశ్రా

చిక్కడపల్లి మే 9 (ప్రభాతవార్త) : ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కోశాధికారి బి.ఎస్. రవి ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి అందించిన సేవలు వెలకట్టలేనివని సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా, అధ్యక్షులు ధర్మరాజ్ మహాపాత్ర కొనియాడారు. శనివారం

సభలో ప్రసంగిస్తున్న ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కోశాధికారి బి.ఎస్. రవి

బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బి.ఎస్. రవి సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నాయకులు మాట్లాడుతూ.. క్లాస్ 3 , క్లాస్ 4 ఉద్యోగుల సమస్యల పరిష్కారంలోనూ, వేతన సవరణ అంశాల్లోనూ రవి దేశవ్యాప్త నాయక త్వానికి ఒక విజ్ఞాన సర్వస్వంలా మార్గనిర్దేశం చేశారని ప్రశంసించారు. సంస్థలో వివిధ హోదాల్లో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ పూర్వ నేతలు అమానుల్లాఖాన్, కె. వేణుగోపాల్, వి. రమేష్‌లతో పాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి సుమారు 500 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. పలువురు సీనియర్ నాయకులు రవితో తమకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా బి.ఎస్. రవి మాట్లాడుతూ.. తనకు సేవ చేసే అవకాశం కల్పించిన ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సంస్థ వల్లే తాను ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపారు. సంస్థ ప్రోత్సాహం లేకుంటే తాను ఇంతటి గుర్తింపు పొందేవాడిని కానని, ఈ గౌరవం తన బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. ఈ వేడుకలో రవి కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు.

IN THE COURT OF THE III ADDITIONAL DISTRICT JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT AT KUKATPALLY
I.A.No.98 OF 2026
IN
OS.NO. 477 OF 2026

Between:
Mrs. T. Maria Anjelena
...Petitioner/Plaintiff
And
Sardar Inderjeet Singh & others
...Respondents/Defendants
NOTICE

To,
Sri T. Parkshit, S/o T. Mahender Reddy, Aged 35 years, Occ. Business R/o Plot No. 115, Neelima Greens Miyapur, Hyderabad.
The petitioner has filed I.A. No.98/2026 in OS No.477 of 2026 on the file of the III Additional District Judge Medchal-Malkajgiri District at Kukatpally Under Order 1 rule 10(2) of CPC and Consequential Amendment under Rule 28 CRP to impled you in OS.No.477 of 2026 as defendant No. 6. The said application is posted on 9.06.2026 for your appearance. You are therefore required to appear in person or through a duly appointed Advocate before the Hon'ble III Additional District Judge Medchal-Malkajgiri District at Kukatpally on 09.06.2026 at 10:30 am failing which the Hon'ble Court shall proceed to decide the matter based on the material available on Record.
// ISSUED UNDER ORDER OF THE COURT//
Sd/-M.NARSIMHA REDDY
AMIT GANU,
Advocates
M/s Ganu & Co
Advocates
201-202, 3.5.874/A,
Vipanchi Estates, Hyderguda
Hyderabad 500 029

మంత్రి తుమ్మలను కలిసిన కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్

కెపిహెచ్‌బి కాలనీ, మే 9, ప్రభాతవార్త



టిపిసిసి ఉపాధ్యక్షుడు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ శనివారం మంత్రి తుమ్మల నాగే శ్వరరావుని సెక్రటేరియట్‌లో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైనందుకు బండి రమేష్‌ను అభినందించారు. పూల బొకే ఇచ్చి శాలువా కప్పి సన్మానించారు. కార్పొరేషన్ చైర్మన్‌గా కమ్మ కులానికి తగిన రీతిలో సేవలు అందించాలని ప్రభుత్వ సహకారంతో కులంలోని పేదలను అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. వారికి అవసరమైన సహాయ సహకారాలను అందించాలన్నారు. కార్పొరేషన్ చైర్మన్‌గా తనను నియమించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రికి బండి రమేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్ర నూతన డిజిపి సివి.ఆనంద్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న లోక్‌జనశక్తి పార్టీ ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్, చిప్పర నర్సింగ్‌రావు, గంటా మోహనరావు, రాములు తదితరులు

VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

I, Thiramdasu Srinivas, S/o Srisailam, residing at 18-377/1, Miryalaguda, Nalgonda, hereby declare that my name is wrongly mentioned as "Thiramdasu Srinivasarao" in my daughter Prathyusha's 10th certificate.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

జనగణనలో బిసి కులగణన చేపట్టాలి

: ఏఎంసి వైస్ ఛైర్మన్ కోట్ల శ్రీనివాస్

ప్రభుత్వ సలహాదారు విహెచ్‌కు సంఘీభావం తెలుపుతున్న ఏఎంసి వైస్ ఛైర్మన్ కోట్ల శ్రీనివాస్

సైదాబాద్, మే 9 (ప్రభాతవార్త): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణనలో భాగంగా బిసి కులగణనను చేపట్టాలని డిమాండ్ చేస్తూ బిసి సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు చేపట్టిన ఆమరణ దీక్ష శిబిరాన్ని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కోట్ల శ్రీనివాస్ సందర్శించి విహెచ్‌కు సంఘీభావం ప్రకటించారు. అనంతరం కోట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ జనగణనలో బిసి ల కాలం మెన్షన్ చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బిసి కులగణనపై నిర్ణయం తీసకున్న తర్వాతే ప్రధాని మోడి తెలంగాణకు రావాలన్నారు. మహిళా రిజర్వేషన్లలోనూ బిసిలకు కోటా కేటాయించలేదని ఆయన విమర్శించారు. బిసి కులగణన వల్ల విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా ప్రాతిపదికన న్యాయం జరుగుతుందన్నారు. విహెచ్‌కు సంఘీభావం తెలిపిన వారిలో బిసి జెఎసి వర్కింగ్ ఛైర్మన్ గుజ్జ కృష్ణ తదితరులు ఉన్నారు.

అమెరికాలో స్విమ్మింగ్ పూల్ ప్రమాదంలో లింగోజిగూడ వాసి మృతి

వీణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సైదాబాద్, మే 9 (ప్రభాతవార్త): లింగోజిగూడ డివిజన్ న్యూ శివపురి కాలనీకి చెందిన దేవేందర్‌రెడ్డి, సునీతల కుమార్తె ముద్దసాని వీణ(28) అమెరికాలోని ఫ్లోరిడలో స్విమ్మింగ్ పూల్ ప్రమాదంలో మృతి చెందింది. దీంతో స్థానికంగా విషాదచ్ఛాయలు నెలకొన్నాయి. వర్జీనియాలో నివాసముంటున్న వీణ అక్కడి ఇన్సురెన్స్ కంపెనీలో పనిచేస్తుంది. రెండు రోజుల క్రితం ఒక ఫంక్షన్ నిమిత్తం ఫ్లోరిడాకు వెళ్లి అక్కడ స్విమ్మింగ్ పూల్‌లో మునిగి అకాల మరణం చెందడంతో ఆమె కుటుంబ సభ్యులు భోరున విలపిస్తున్నారు. వీణ కుటుంబ సభ్యులను ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డిలు పరామర్శించారు.

విహెచ్ హనుమంతరావు రిలే నిరహార దీక్షకు తరలిన కాంగ్రెస్ నాయకులు

రిలే నిరాహార దీక్ష కార్యక్రమానికి తరలివెళ్తున్న పోల్కం శ్రీనివాస్ తదితరులు

మలక్ పేట, మే 9, (ప్రభాతవార్త):
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ, సీనియర్ బీసీ నాయకుడు విహెచ్ హనుమంతరావు రిలే నిరాహార దీక్ష నిర్వహిస్తున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ సీనియర్ జనరల్ సెక్రెటరీ పోల్కం శ్రీనివాస్ మేరు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో పెద్ద ఎత్తున తరలి వెళ్లి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా సామ ప్రభాకర్ రెడ్డి

మలక్ పేట, మే 9, (ప్రభాతవార్త):
రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా దిల్ షుక్ నగర్ షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ చైర్మన్, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు. యువత బ్యాడ్మింటన్ క్రీడపై ఆసక్తి పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా తనను నియమించినందుకు రంగారెడ్డి జి ల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లెల గోపీచంద్, కోశాధికారి కరెడ్ల శ్రీనివాసరావులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

వినాయక్ నగర్ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

-ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి హామీ

నేరేడ్ మెట్ , మే 9,(ప్రభాతవార్త :
వినాయక్ నగర్ రైల్వే గేట్ ప్రాంతంలో ప్రతిపాదితంగా చేపట్టనున్న ఆర్‌యూబీ (రోడ్ అండర్ బ్రిడ్జ్) నిర్మాణంతో స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినాయక్ నగర్ డివిజన్‌కు చెందిన స్థానికులు, చిరు వ్యాపారస్తులు కలిసి రైల్వే అధికారులు చేపడుతున్న భూసేకరణ మార్కింగ్‌పై తమ ఆందోళనలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఉన్న రహదారి పరిస్థితులకు అనుగుణంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టాలని, కొత్తగా విస్తృత భూసేకరణ చేయవద్దని కోరారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, రైల్వే అధికారులతో మాట్లాడి స్థానికులకు అన్ని విధాలుగా న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. కాలనీవాసుల అభిప్రాయాలు, సూచనలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బద్దం పరశురాం రెడ్డి, సురేష్, కృష్ణమూర్తి, ఫరీద్, బాలకృష్ణ, మణికంఠ, ఉమేష్‌తో పాటు వినాయక్ నగర్ వాసులు పాల్గొన్నారు.

రూ.34లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులు : రజితరెడ్డి

ఉప్పల్, మే 9 (ప్రభాతవార్త :



ఉప్పల్ శివాలయం వద్ద డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్ డివిజన్ శ్రీ రామకాలనీ శివాలయం వద్ద రూ.34 లక్షల వ్యయంతో చేపడుతున్న డ్రైనేజీ పనులను శనివారం మాజీ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉప్పల్ శ్రీరామ కాలనీలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా కొత్త డ్రైనేజీ నిర్మాణం పనులు చేపడుతున్నామని తెలిపారు. త్వరలోనే సిసి రోడ్డు పనులు కూడా చేపడుతామని తెలిపారు. కాలనీలో ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో స్థానిక నేతలు బావికాడి సత్తి రెడ్డి, రాఘవేందర్ గుప్తా, మధు చారి, రాజు రవీందర్ రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, సోమ మల్లేష్, దుర్గా రెడ్డి, చంద్రశేఖర్, కిశోర్, సోమబాలమణి, సాయిబాబీ, మలమ్మ, ప్రభావతి, యాదమ్మ, పర్వతాలు తది తరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లకు కఠిన శిక్ష తప్పదు

-పెట్టుబడి మోసాలపై అప్రమత్తంగా ఉండాలి : సిపి సుమతి

-రెండు కేసులు ఛేదించిన మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీసులు.. ఇద్దరు అరెస్ట్

హైదరాబాద్ , మే 9 (ప్రభాతవార్త): మహిళలు, యువత, సాధారణ ప్రజలను లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లపై కఠిన చర్యలు తప్పవని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి . సుమతి హెచ్చరించారు. ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులు, నకిలీ ట్రేడింగ్ యాప్‌ల ద్వారా అమాయకులను మోసం చేస్తున్న ముఠాలపై సైబర్ క్రైమ్ పోలీసులు నిరంతరం నిఘా పెట్టి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీసులు రెండు కీలక పెట్టుబడి మోసాల కేసులను ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. దేశవ్యాప్తంగా విస్తరించిన సైబర్ మోసగాళ్ల నెట్‌వర్క్‌లతో వీరికి సంబంధాలు ఉన్నట్లు విచారణలో బయటపడింది. అదేవిధంగా బాధితులకు గౌరవ న్యాయస్థానం ఆదేశాల మేరకు రూ. 4,31,180లను రీఫండ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

బిట్‌కాయిన్ ట్రేడింగ్ పేరుతో మోసం

హెచ్‌ఓడిఐహెచ్‌ఓడిఎల్.కామ్ పేరుతో నకిలీ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ సృష్టించి అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి ఓ వ్యక్తి నుంచి భారీ మొత్తంలో నగదు వసూలు చేసిన కేసును పోలీసులు ఛేదించారు. మొదట చిన్న మొత్తాల్లో లాభాలు చూపించి నమ్మకం పెంచిన మోసగాళ్లు అనంతరం మరిన్ని పెట్టుబడులు పెట్టించాలని ఒత్తిడి తెచ్చారు. తర్వాత సైబర్ క్రైమ్ ఫిర్యాదును మూసివేస్తామంటూ నకిలీ పత్రాలు, ఫేక్ ఎఫ్ఐఆర్‌లు చూపించి మరింత డబ్బులు దోచుకున్నట్లు గుర్తించారు. ఈ కేసులో ఒడిశాకు చెందిన రౌమ్య రంజన్ పండాను పోలీసులు అరెస్ట్ చేశారు.

ఫీన్స్ ప్రో యాప్‌తో రూ.41 లక్షల టోకరా

మరో కేసులో ఫీన్స్ ప్రో పేరుతో నకిలీ ట్రేడింగ్ యాప్ ద్వారా స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో ఓ వ్యక్తిని మోసం చేసిన ఘటనను పోలీసులు వెలుగులోకి తెచ్చారు. వాట్సాప్ గ్రూపుల ద్వారా స్టాక్ టిప్స్, భారీ లాభాల స్క్రీన్‌షాట్లు పంపిస్తూ బాధితుడిలో నమ్మకం కల్పించారు. యాప్‌లో కోట్ల రూపాయల లాభాలు వచ్చినట్లు చూపించి మరిన్ని పెట్టుబడులు పెట్టించారు. చివరకు డబ్బులు విత్‌డ్రా చేసుకునే సమయంలో కమిషన్ పేరుతో మరింత నగదు డిమాండ్ చేయడంతో మోసం బయటపడింది. ఈ కేసులో గుంటూరు జిల్లా దాచేపల్లికి చెందిన ఆటుకూరి సంతోష్ కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

అపరిచిత లింకులు నమ్మొద్దు

అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే పెట్టుబడి ఆఫర్లు, ట్రేడింగ్ లింకులు, అధిక లాభాల హామీలను ప్రజలు నమ్మవద్దని సీపీ సుమతి సూచించారు. గుర్తు తెలియని యాప్‌లు డౌన్‌లోడ్ చేయకూడదని, పోలీసులమని లేదా కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారులమని చెప్పి డబ్బులు అడిగితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్ లైన్‌కు కాల్ చేయాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని కోరారు.

జనగణనపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

: ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

హైదరాబాద్ 9 మే, (ప్రభాతవార్త :

2కే రన్‌లో పాల్గొన్న ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

జనగణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్)పై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణనకు ప్రాముఖ్యతను గుర్తుచేస్తూ మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్, సరూర్‌నగర్ సర్కిల్ అధ్వర్యంలో సెల్ఫ్ ఎన్యుమరేషన్‌పై అవేర్‌నెస్ కొరకు సరూర్‌నగర్ లోని విక్టోరియా మెమోరియల్ పాఠశాల నుండి కొత్తపేట చౌరస్తానవరకు 2కే రన్‌ను నిర్వహించారు. ఈ రన్‌లో వివిధ హోం వాకర్స్, పలు కాలనీల ప్రజలు పాల్గొన్నారు. జనగణనలో అందరూ పాల్గొనాలని నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహణ కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మట్లాడుతూ జనగణనపై ప్రతి పౌరుడు శ్రద్ద తీసుకోవాలని అన్నారు. దీని కొసం అధికారుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి స్వచ్ఛం ధసంస్థలు, కాలనీ సంక్షేమ సంఘాలు, మహిళా సంఘాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, బుచ్చయ్య, సానిటేషన్ అధికారి చందన, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బేర బాలకిషన్, కబీర్‌దాస్‌గౌడ్, జక్కుల శ్రీశైలం యాదవ్, కనకారావు పాల్గొన్నారు.

భారీ సంఖ్యలో ప్రధాని మోడీ బహిరంగ సభకు తరలివెళ్లనున్న బిజెపి శ్రేణులు

-భాగ్యనగర్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి

మలక్ పేట, మే 9, (ప్రభాతవార్త):

భాగ్యనగర్ జిల్లా పరిధిలో ప్రజలకు కరపత్రాలను అందజేస్తున్న బిజెపి భాగ్యనగర్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మడిగల లక్ష్మారెడ్డి, నాయకులు తదితరులు

దేశ ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభకు భాగ్యనగర్ జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ సంఖ్యలో బిజెపి శ్రేణులు తరలి వెళ్ళనున్నట్లు బిజపి భాగ్యనగర్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మాడిగల లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. నేడు (ఆదివారం) నగరంలోని పేరేడ్ గ్రౌండ్స్ లో జరగనున్న ప్రధాని మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ మాడిగల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో భాగ్యనగర్ జిల్లా పరిధిలోని పలు ప్రాంతాలలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లడంతో పాటు వ్యాపార సముదాయాలు, వాణిజ్య ప్రాంతాలు, మార్కెట్లు, కిరాణా దుకాణాలలో కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి నగరానికి విచ్చేస్తున్న సందర్భంగా నేడు నగరంలోని పేరేడ్ గ్రౌండ్ లో పెద్ద ఎత్తున బహిరంగ సభ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ నినాదమే విధానంగా కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా 140 కోట్ల భారతీయుల అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోడీ పాటుపడుతున్నారని తెలిపారు. మలక్ పేట్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలోని కాలనీలు, బస్తీలలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రధాని మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతున్నామని వివరించారు. ప్రధాని మోడీ బహిరంగ సభకు ఆస్మాన్ ఘాడ్ డివిజన్ వందలాదిమంది నాయకులు, కార్యకర్తలతో కలిసి తరలి వెళ్లనున్నట్లు తెలిపారు. తెలంగాణలో బిజెపి జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మలక్ పేట్ నియోజకవర్గంలో బిజెపి పార్టీ చాలా బలంగా ఉందని తెలిపారు. ప్రజలు బిజెపి పాలనను కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ప్రధాని మోడీకి ఘనంగా స్వాగతం పలుకుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏ. గజానంద్, ఆర్. బి. చారి, రవి, శ్రీను, సురేష్, రిషిరాజ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రామంతాపూర్ గణేష్‌నగర్‌లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

రామంతాపూర్, మే 9 (ప్రభాతవార్త : రామంతాపూర్ డివిజన్ పరిధిలోని గణేష్ నగర్, ఉప్పల్ భగాయత్‌లో శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పలువురు అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రామంతాపూర్ గణేష్‌నగర్‌లో పర్యటించి కాలనీవాసులతో బేటి అయ్యారు. కాలనీలో బస్టాప్ మార్చాలని, ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతాయని తెలిపారు. మండి హౌజ్ వద్ద కాలనీలో రద్దీ పెరిగి, అపరిశుభ్రత ఏర్పడుతుందని, దుర్వాసనలు వస్తున్నాయని తెలిపారు. శిధిలావస్థకు చేరిన చెట్టు తొలగించాలని, కాలనీ మీదుగా వెళ్లే హైటెన్షన్ విద్యుత్ లైన్ల వల్ల ప్రజలకు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. దీంతో పాటు పలు చోట్ల రోడ్లపై అక్రమంగా వాహనాలు పార్క్ చేయడం వల్ల రాకపోకలకు ఆటంకం కలుగుతోందని విన్నవించారు. దీనిపై అధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఉప్పల్ భగాయత్ హెచ్ఎండిఏ లేఔట్ వెస్ట్ పేజ్ లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పర్యటించారు. లేఔట్ లో రోడ్లు, డ్రైనేజ్, వీధి దీపాలు, కమ్యూనిటీ హాల్ బిల్డింగ్ సమస్యలు ఉన్నాయని, లేఔట్ లో బయటనుంచి చెత్త ట్రాక్టర్లు తీసుకువచ్చి అస్తవ్యస్తంగా రోడ్లపై నింపడం వలన రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పసుల ప్రభాకర్‌రెడ్డి, గంధం నాగేశ్వర్‌రావు, కాలేరు జైనవీన్, డా.బి.వి.చారి, బోసాని పవన్, చాంద్ పాషా, ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల మధుసూదన్ రెడ్డి, శివప్రసాద్, డాక్టర్ రాఘవేందర్, శ్రీరామ్, సందీప్, విష్ణువర్ధన్ రెడ్డి, మల్లికార్జున్, కమల్, మహిపాల్, టీవీఎస్ఎస్ కృష్ణమూర్తి, ఆదిత్య, బాలకృష్ణ, నరోత్తం రెడ్డి, శేషాచారి, కృష్ణ, రాజు, సందీప్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, వాసవి మెట్రో పోలీస్, ఇతర అపార్ట్‌మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోడి బహిరంగ సభ విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు

మోడీ సభ విజయవంతం కావాలని కోరుతూ లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయంలో అర్చన చేయిస్తున్న కొలన్ శంకర్‌రెడ్డి

సరూర్‌నగర్, మే 9 (ప్రభాతవార్త): సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ప్రధాని నరేంద్ర మోడి బహిరంగ విజయవంతం కావాలని కోరుతూ తెలంగాణ బిజెపి కో-ఆపరేటివ్ సెల్ రాష్ట్ర కన్వీనర్, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి శనివారం మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ చౌరస్తా సమీపంలోని ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలో నున్న శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ ఎడ్ల మల్లేష్ ముదిరాజ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన అర్చన చేయించారు. అనంతరం స్థానిక మాజీ కార్పొరేటర్ కార్యాలయంలో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర బిజెపి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మోడీ సభకు లక్షలాదిగా ప్రజలు తరలిరావాలని భగవంతుడిని కోరినట్లు తెలిపారు. ముఖ్యంగా సభకు ఏ రకంగా కూడా ఆటంకాలు కలగవద్దని ప్రార్థించనట్లు ఆయన వెల్లడించారు. బిజెపి నాయకులు తమ స్థానిక బూత్ పరిధి నుండి కనీసం 20 మందికి తగ్గకుండా మోడీ సభకు తరలించాలని సూచించారు. తెలంగాణ రాజకీయాల్లో చాలా కీలకమైన ఈ సభ విజయవంతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కంకణబద్ధులు కావాలని శంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, జోరల ప్రభాకర్, రాజేష్‌రెడ్డి, భూషణం, రవీందర్, జనార్ధన్, రామిడి శేఖర్‌రెడ్డి, ఎం.ప్రభాకర్‌రెడ్డి, జి.సురేష్‌కుమార్, పెద్దింటి సుధాకర్, రవికుమార్, లక్ష్మణరాజు తదితరులు పాల్గొన్నారు.

బిసిల హక్కుల దీక్షకు కాంగ్రెస్ పార్టీ నేతల మద్దతు



బిసి హక్కుల కోసం దీక్ష చేస్తున్న వి. హనుమంతరావుకు మద్దతు ప్రకటిస్తున్న కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్ తదితరులు

రామంతాపూర్, మే 9 (ప్రభాతవార్త : తెలంగాణలో బిసి జనగణనతో పాటు బిసి వర్గీకరణ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర సలహాదా రుడు మాజీ పీసీసీ అధ్యక్షుడు వి. హనుమంత రావు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు రామంతాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మ ద్ రఫీక్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల సామాజిక న్యాయం కోసం పోరాటం చేస్తున్నారని, బిసిల హక్కుల సాధన కోసం నిరంతర ఉద్యమం ప్రజల గళాన్ని కేంద్ర ప్రభుత్వానికి విని పించే ధైర్యవంతమైన నాయకుడని పేర్కొన్నారు. బీసీలకు న్యాయం చేసి వర్గీకరణ కూడా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా పై మండిపడ్డారు. ప్రజల సమస్యలపై రాజీ లేని పోరాటమే కాంగ్రెస్ సిద్ధాంతమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి షేక్ సమీర్ భాయి జాంగిర్ భాయ్, గంగపుత్ర భాస్కర్, చిన్న చోటు భాయ్ పాల్గొన్నారు.

పేదింటి వధువులకు ఉప్పల అండ

పుస్తెమట్టెలు అందజేస్తున్న స్వప్న శ్రీనివాస్ గుప్తా

ఎల్.బి.నగర్, మే 9 (ప్రభాతవార్త): పేదింటి ఆడపిల్లల వివాహానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నామని టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. నాగోల్ ఉప్పల క్యాంపు కార్యాలయంలో ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐవిఎఫ్ ప్రధమ మహిళ ఉప్పల స్వప్నతో కలిసి శనివారం కామారెడ్డి జిల్లా సిరసముందర్ గ్రామానికి చెందిన సాత్విక, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా షామీర్ పేటకు చెందిన లలిత, ఓల్డ్ మలక్ పేటకు చెందిన శివానిల వివాహానికి అవసరం పేదింటి ఆడపిల్ల వివాహానికి కావలసిన పుస్తెమట్టెలు, చీరే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ మాట్లాడుతూ ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, పేదింటి ఆడపిల్లల వివాహానికి అండగా నిలవాలని పూస్తేమట్టెలు, చీర అందజేస్తున్నామన్నా రు. కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తుంకుంట నర్సిరెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు కొలిపాక నారాయణ, దైవాదినం, భద్రాద్రి, వీరన్న, నరేష్ గుప్త, ప్రవీణ్ గుప్త, శ్రీధర్ గుప్త, తల్లిదండ్రులు నీరడి అంజవ్వ, నీరడి యాదరావ్, రాపాని ఎల్లయ్య, యాదమ్మ, ఎడ్ల అనురాధ, ఎడ్ల ఈశ్వర్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజనులకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ఎల్.బి.నగర్, మే 9 (ప్రభాతవార్త):
సీనియర్ సిటిజన్లో తమ అనుభవాలను నేటి యువతకు పంచాలని, సీనియర్ సిటిజన్లకు తాము అండగా నిలుస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే జైరెడ్డి సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. చైతన్యపురి డివిజన్ ద్వారకాపురం, విద్యుత్ నగర్, న్యూదిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాలకు చెందిన సీనియర్ సిటిజెన్స్ శనివారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజెన్స్ సమాజానికి మార్గదర్శకులని, వారి సంక్షేమం కోసం ఎల్లప్పుడూ తాను అండగా ఉంటానని, అవసరమైన మౌలిక వసతులు, ఆరోగ్య పరిరక్షణ, భద్రత, సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ యువ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, ద్వారకాపురం సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు ప్రసాద్, భవానినగర్ కాలనీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, విద్యుత్ నగర్ కాలనీ అధ్యక్షులు శ్రీనివాసచారి, రాఘవరెడ్డి, సత్యనారాయణ, ఏజే దాస్, నారాయణరావు, శ్రవణ్, సాయిబాబా, కెఎస్.శ', సుబ్బారావు, దుర్గారావు పాల్గొన్నారు.

క్రైస్తవుల శ్మశాన వాటిక స్థలాలు కేటాయించాలని వినతి



ఉప్పల్‌లో జరిగిన సమావేశంలో సమస్యలు వివరిస్తున్న క్రైస్తవ సంఘం నేతలు, ఇతర నాయకులు

ఉప్పల్, మే 9 (ప్రభాతవార్త : నగరంలో క్రైస్తవుల స్మశానవాటిక స్థలాలు కేటాయించాలని క్రిస్టియన్ మైనార్టీ సంఘం నేతలు పాస్టర్ జి.కె.బాబు, పాస్టర్ బిసికె దేవదానం, పాస్టర్ జి.ప్రభాకర్, పాస్టర్ గోన నతానియల్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఉప్పల్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణలో క్రైస్తవ సమాజం కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉందని తెలిపారు. క్రైస్తవ సమాజం ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తూ వస్తోందని తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూడా నిరూపించామని తెలిపారు. దీంతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం క్రైస్తవ సమాజం కోసం అనేక పథకాలను ప్రారంభించిందని, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్, క్రైస్తవ విద్యార్థులకు రూ. 20 లక్షల స్కాలర్ షిప్, మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు, క్రిస్మస్ వేడుకలకు నిధుల కేటాయింపు, నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. కాగా నగరంలోని పలు ప్రాంతాల్లో క్రైస్తవ శ్మశానవాటికలు లేకపోవడం వల్ల మరణంలో గౌరవం లేదని సమాజంలో అభద్రత భావన ఉందన్నారు. ఒక్కో ప్రాంతంలో పది ఎకరాల స్థలం కేటాయించాలని కోరారు. దీనిపై సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి అజారుద్దీన్, తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డిని కలిసి విన్నవించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి నగరంలోని తూర్పు, పశ్చిమ, ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో 10 ఎకరాలు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు క్రైస్తవ సంఘం నేతలు పాల్గొన్నారు.

బిజెపి సభకు భారీ ట్రాఫిక్ ఏర్పాట్లు

-బస్సులకు ప్రత్యేక పార్కింగ్ కేంద్రాలు..

-సహాయం కోసం అధికారుల ఫోన్ నంబర్లు

హైదరాబాద్, మే 9(ప్రభాతవార్త : హైదరాబాద్‌లో నేడు నిర్వహించనున్న బీజేపీ భారీ బహిరంగ సభ నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే బస్సుల కోసం ప్రత్యేక డ్రాపింగ్ పాయింట్లు, పార్కింగ్ ప్రదేశాలను ట్రాఫిక్ విభాగం ప్రకటించింది. నల్గొండ, ఖమ్మం, వరంగల్ ప్రాంతాల నుంచి ఎల్‌బీనగర్, ఉప్పల్ మార్గంలో వచ్చే బస్సులను ఉప్పల్ వద్ద దింపి ఐఎల్ఎఫ్ పార్కింగ్, ఉప్పల్ స్టేడియం, ఉప్పల్ భగాయత్, రైల్వే డిగ్రీ కాలేజ్, ఆర్‌ఆర్‌సీ గ్రౌండ్స్‌లో నిలిపివేయ నున్నారు. దీనికి సంబంధించి సహాయం కోసం ఉప్పల్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వో నాగరాజును 8712662421 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. మెదక్, నిజామాబాద్, కరీంనగర్ ప్రాంతాల నుంచి బోయిన్ పల్లి, తిరుమలగిరి మార్గంలో వచ్చే బస్సులను ధోబీఘాట్ వద్ద దింపి బైసన్ పోలో గ్రౌండ్, ధోబీఘాట్, ఇంపీరియల్ గార్డెన్, బోయిన్‌పల్లి మార్కెట్ యార్డ్‌లలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. వివరాలకు తిరుమలగిరి ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వో వి.సర్దార్ నాయక్‌ను 8712660624 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. మహబూబ్‌నగర్, సంగారెడ్డి, కర్ణాటక ప్రాంతాల నుంచి మెహదీపట్నం, హైటెక్ సిటీ, చాదర్‌ఘాట్ మార్గాల్లో వచ్చే బస్సులను సంజీవయ్య పార్క్, నెక్లెస్ రోడ్, నల్లగుట్ట సబ్‌స్టేషన్ ప్రాంతాల్లో దింపనున్నారు. వీటి కోసం నెక్లెస్ రోడ్, ఎన్టీఆర్ స్టేడియం, బస్ భవన్, నిజాం కాలేజ్, ఎగ్జిబిషన్ గ్రౌండ్, పబ్లిక్ గార్డెన్ ప్రాంతాల్లో పార్కింగ్ సౌకర్యం కల్పించారు. దీనికి సంబంధించి ఎస్.మోహన్ కుమార్ (8712660614), ఎ.శ్రీనివాస్ (8712660617)లను సంప్రదించాలని పోలీసులు సూచించారు. పార్కింగ్ ప్రదేశాలు పూర్తిగా నిండిపోతే వాహనాలను నగర శివార్లకు మళ్లించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బడంగ్‌పేట్ సర్కిల్ డివిజన్లలో ఈ వేస్ట్ మెగా కలెక్షన్ డ్రైవ్

ఈ వేస్ట్ మెగా కలెక్షన్ డ్రైవ్‌ను పర్యవేక్షిస్తున్న బడంగ్‌పేట్ డిసి సమ్మయ్య

సరూర్‌నగర్, మే 9 (ప్రభాతవార్త): ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాల్లో భాగంగా జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్-16లో శనివారం ఈ వేస్ట్ మెగా కలెక్షన్ డ్రైవ్‌ను నిర్వహించారు. లూప్ సస్టేనబిలిటీ సంస్థ సమన్వయంతో సర్కిల్ పరిధిలోని మొత్తం 6 డివిజన్లలో నిర్దేశించిన కేంద్రాల్లో ఈ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి డ్రైవ్‌కు మంచి స్పందన లభించింది. చాలా మంది తమ ఇళ్లల్లో వృధాగా ఉన్న పాడైన ఎలక్ట్రానిక్, కంప్యూటర్, ఇతర వస్తువులను, పరికరాలను స్వచ్ఛందంగా ఈ వేస్ట్ మెగా కలెక్షన్ డ్రైవ్ కేంద్రాలకు తెచ్చి అందజేశారు. శనివారం అన్ని కేంద్రాల్లో కలిసి మొత్తం 105 కిలోల ఈ వేస్ట్ సేకరణ జరిగింది. అయితే ఈ వేస్ట్ అందజేసిన వారికి రివార్డు పాయింట్లు అందజేశారు. కాగా ఈ డ్రైవ్‌ను డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య ఎఇ గంగా ప్రసాద్‌తో కలిసి పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ వేస్ట్ మెగా కలెక్షన్ డ్రైవ్ నిర్వహణ సంతృప్తికరంగా ఉందని వెల్లడించారు. డ్రైవ్ విజయవంతానికి కృషి చేస్తున్న రిసోర్స్ పర్సన్లు, సిబ్బందిని డిసి అభినందించారు. ఆదివారం కూడా నిర్దేశించిన కేంద్రాల్లో డ్రైవ్ కొనసాగుతున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సేకరించిన ఈ వేస్ట్‌ను సురక్షితంగా రీసైక్లింగ్ చేయడం జరుగుతుందని ఆయన వెల్లడించారు.

మల్కాజిగిరి సిపి సుమతితో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బేటి

మల్కాజిగిరి సిపి సుమతికి పుష్పగుచ్చం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్, మే 9 (ప్రభాతవార్త : మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతితో శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బేటి అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని శాంతి భద్రతల అంశాలపై, ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలు అందించే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అదే విధంగా పలు చోట్ల ట్రాఫిక్ సమస్యలు, కాలనీల్లో భద్రతా ఏర్పాట్లు, మహిళల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు, రాత్రి పహారా బలోపేతం వంటి అంశాలను ఆయన సిసి దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ సందర్భంగా సీపీ సుమతి మాట్లాడుతూ ప్రజల భద్రత తమ ప్రాధాన్యత అని, ఉప్పల్ ప్రాంతంలో పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బండారి నీలం రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, మహిపాల్ రెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మహారాణా ప్రతాప్ జయంతి వేడుకలు

మహారాణా ప్రతాప్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న క్షత్రియ రాజ్ పుత్ సంఘం నేతలు పర్వేష్ సింగ్ తదితరులు

ఉప్పల్, మే 9 (ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని చిలుకానగర్ డివిజన్‌లో శనివారం మహారాణా ప్రతాప్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహారాణా ప్రతాప్ చిత్రపటానికి పలువురు నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మహారాణా ప్రతాప్ చేసిన సేవలను వారు కొనియాడారు. మహారాణా ప్రతాప్ ఆశయసాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు పర్వేష్ సింగ్, ఠాకూర్ ఉమేష్ సింగ్, ముక్కాల రామకృష్ణ, దేవసాని బాలచందర్, ప్రదీప్, బాలాజీ సింగ్, కులదీప్ సింగ్, అనీష్ సింగ్, విగ్నేష్ సింగ్, అంకుష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు

ఉప్పల్, మే 9 (ప్రభాతవార్త :



భరత నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగం గా శ్రీ లాస్య నృత్యాలయ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రైడ్ ప్రపంచ రికార్డ్స్ సహకారంతో శనివారం నాట్య సూత్రం కార్యక్రమం నిర్వహించారు. ఉప్పల్ శిల్పారామం వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో. జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతీ మహాస్వామి ఆశీస్సులతో, నాట్యాచార్య డా.విశాఖ ప్రకాష్ మార్గదర్శకత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం భరతనాట్య వైభవాన్ని, భారతీయ సంస్కృతిని, భక్తి సంప్రదాయాన్ని ప్రతిబింబించింది. అంతర్జాతీయ ప్రైడ్ ప్రపంచ రికార్డ్స్ ఆధ్వర్యంలో ప్రపంచ రికార్డు ప్రయత్నంగా నిర్వహించబడిన ఈ కార్యక్రమం కళ, సంస్కృతి, ఆధ్యాత్మికతల సమ్మేళనంగా నిలిచింది.